
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 20 జూన్ 2025





ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాల దంపతులు

వైభవంగా వెంగమాంబ తిరునాళ్ల

- అంబరాన్నంటిన సంబరాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 19(ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈనెల 15న నిలుపుతో ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులపాటు వైభవంగా జరిగాయి. చివరి రోజున వెంగమాంబ పేరంటాల దంపతులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆశీనులు చేసి పరిసర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచే నర్రవాడకు భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు అత్యధికంగా తరలివచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు ఎండు కొబ్బరి హోమగుండంలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి నుంచి

- మిగతా 5వ పేజీలో



హంస వాహనంపై దర్శనమిచ్చిన కామాక్షి సమేత రామలింగేశ్వరుడు

హంసపై రామలింగేశ్వరుడి

విహారం

విడవలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కామాక్షీదేవి సమేత రామలింగేశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. పాలు, నీరును హంస వేరు చేసినట్లుగా మానవులు మంచి-చెడును తెలుసుకుని జీవనాన్ని సాగించాలని చాటి చేప్పేందుకు రామలింగేశ్వరుడు వాణీ,బ్రహ్మ స్వరూపంలో హంస వాహనంపై విహరించారని పురాణాలు పేర్కొన్నాయి. తొలుత ఆలయ ప్రధాన పూజారి శ్రీకాంత్ శర్మ స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, మహన్యాస రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, నివేదన, బలిహరణ పూజలు చేశారు. అనంతరం అత్యంత సుందరంగా అలంకరించిన హంస వాహనంపై రామలింగేశ్వరుడు కామాక్షీదేవి సమేతుడై రామతీర్థం, వరిణి గ్రామ వీధుల్లో ఊరేగారు. ఈ వేడుకలకు వరిణి గ్రామానికి చెందిన సురేష్‌కుమార్, అశోక్ కుమార్, శిబివాహన్ ఉభయ కర్తలుగా వ్యవహరించారు. రామతీర్థం గ్రామానికి చెందిన ఆవుల చలపతి-వరలక్ష్మీ దంపతులు పూలంగి సేవకు ఉభయకర్తలుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్,ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

యోగా దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్

నెల్లూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో శనివారం యోగాదినోత్సవ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈనెల 21న నిర్వహించాల్సిన అంతర్జాతీయ యోగా దినోత్సవంపై గురువారం అమరావతి నుంచి సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో వార్డు, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఏడువేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది అంతా కూడా తమతమ పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్ ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పదివేలమందితో సామూహిక యోగాసనాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్‌లను అందచేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ కే. కార్తీక్, నోడల్ ఆఫీసర్ ఆర్‌కే.యతిరాజ్, డీఈవో బాలాజీరావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లా సెట్ ఫలితాల విడుదల

- ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలల్లో ప్రవేశానికి తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న లాసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. రెండేళ్ల పీజీ లాసెట్‌తోపాటు మూడేళ్ల, ఐదేళ్ల లాసెట్ ఫలితాలను కూడా ఒకేసారి విడుదల చేశారు. పీజీ ప్రవేశ పరీక్షకు జిల్లాలోని ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి మొత్తం 127 మంది దరఖాస్తు చేసుకోగా, 115 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 111 మంది ఉత్తీర్ణత సాధించారు. మూడేళ్ల లాకోర్సుకు మొత్తం 1166 మంది దరఖాస్తు చేసుకోగా, 945 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 934 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదేళ్ల లాకోర్సుకు మొత్తం 228 మంది దరఖాస్తు చేసుకోగా, 194 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 189 మంది ఉత్తీర్ణత సాధించారు.

జూలై 3 వరకు కాకాణికి రిమాండ్

నెల్లూరు (లీగల్), జూన్ 19(ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టు సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసి డబ్బు వసూలు చేశారన్న కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జూలై 3 వరకు రిమాండ్ విధిస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పాలంగళం వినోద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ముత్తుకూరు పోలీసులు కాకాణిని పీటీ వారెంట్ మీద కోర్టులో హాజరు పరచగా, న్యాయాధికారి ఇరుపక్షాల వాదనలు విన్నాక, ఐపీసీ సెక్షన్ 409ను తొలగిస్తూ కాకాణిని జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

ఆయనపై అంత ప్రేమెందుకో...?

- కాంట్రాక్టర్ నుంచి నగదు రికవరీపై దోబూచులాట
- నాణ్యత లేకుండా సోమశిల రోడ్డు నిర్మాణం
- పదేళ్ల క్రితం తిరస్కరించిన క్యూసీ చీఫ్ ఇంజనీర్
- చర్యలకు విజిలెన్స్ సిఫార్సు
- పైగా ఆర్అండ్‌బి మంత్రి కూడా ఆదేశాలు
- అయినా కదలని ఆశాఖ అధికారులు

నెల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ నివేదిక అంటే లెక్కలేదు... విజిలెన్స్ డీజీ సిఫార్సులపై గౌరవం లేదు... ఆర్అండ్‌బీ సెక్రటరీ ఉత్తర్వులు అంటే బాధ్యత లేదు... సాక్షాత్తూ ఆర్అండ్‌బీ మంత్రి ఆదేశించినా భయమే లేదు...! కానీ ప్రజాధనాన్ని దోచుకున్న కాంట్రాక్టర్ అంటే మాత్రం ఎంతో ప్రేమ..! ఇదీ క్లుప్తంగా ఆర్అండ్‌బీశాఖలో పరిస్థితి. ఆత్మకూరు-సోమశిల రోడ్డును పదేళ్ల క్రితం నాసిరకంగా నిర్మించడంతో అనతికాలంలోనే దెబ్బతింది. అప్పట్లోనే ప్రజలు గగ్గోలు పెట్టడంతో ఏకంగా క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వచ్చి విచారించి, రోడ్డు వర్కు మొత్తాన్ని రిజెక్ట్ చేశారు. ఆ తర్వాత విజిలెన్స్ అధికారులు కూడా లోతుగా విచారించి కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయడంతోపాటు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. కానీ ఏళ్లు గడిచిపోతున్నా ప్రజాధనాన్ని రికవరీ చేయడం గానీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంగానీ, మళ్లీ దెబ్బతిన్న రోడ్డును బాగు పరచడంగానీ చేయలేదు. ఈ చర్యలకు సంబంధించిన ఫైలు ఆ కార్యాలయానికి, ఈ కార్యాలయానికి అంటూ తిరుగుతోందితప్ప ఫలితం ఉండడం లేదు. ఆర్అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తూ ప్రజాధనం రికవరీపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీగా చేతులు తడిసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

• రిజెక్ట్ చేసిన క్యూసీ సీఈ

ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి పదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కిలోమీటర్ 17 నుంచి కిలోమీటర్ 40 వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో రోడ్డు నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందడంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారణకు వచ్చారు. రోడ్డు నాణ్యతను పరిశీలించి నిబంధనల మేరకు నాణ్యత లేదని నిర్ధారించారు. అప్పటి వరకు జరిగిన పనుల్లో మొత్తం ఇదే మాదిరిగా నిర్మాణం జరగడంతో ఆ వర్కునే



- మిగతా 6వ పేజీలో

బువ్వ భలేగుంది !

- సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తయారీ
- పథకంపై విద్యార్థుల సంతృప్తి
- త్వరలో పెంచిన మెనూ చార్జీల అమలు



సన్నబియ్యంతో చేసిన వెజిటబుల్ బిర్యానీ

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థలో పలు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు సన్న బియ్యంతో కమ్మటి భోజనం పెడుతున్నది. అంతేకాక త్వరలో పెంచిన మెనూ చార్జీలు అమలులోకి తీసుకురానున్నది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఒక్కొరికి రూ. రూ.5.88 వస్తుంది. ఆ మొత్తాన్ని రూ. 6.19లకు పెంచింది. ఉన్నత పాఠశాల విద్యార్థికి ఇస్తున్న రూ. 8.57లను రూ. 9.29లకు పెంచింది. గతంలో దొడ్డు బియ్యంతో భోజనం తయారుచేసి వడ్డిస్తుండడంతో పిల్లలు సరిగా తినేవారు కాదు. చాలా మంది అర్ధాకలితో అలమటించేవారు. మరికొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు క్యారేజీలో మధ్యాహ్న భోజనం తెచ్చుకునే వారు. ఈ సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సన్న బియ్యంతో భోజనం అందించడానికి శ్రీకారం చుట్టింది. మెనూ ప్రకారం సన్నబియ్యంతో కమ్మటి భోజనం పెడుతున్నది. మధ్యాహ్న భోజనం అమలు తీరుపై గురువారం 'ఆంధ్రజ్యోతి' పలు ప్రభుత్వ పాఠశా లలను విజిట్ చేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను పలకరించింది. విద్యార్థులు గతం కంటే సన్న బియ్యంతో వండిన భోజనం రుచికరంగా ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు తాము సైతం పాఠశాలల్లో వండిన భోజనమే తింటున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ సంఖ్య తగ్గుతుందని ఉపాధ్యాయులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ముందుగా వంటగదిలోకి వెళ్లి ఏజెన్సీ నిర్వాహకులను పలకరించింది. గతంలో ఎంత బాగా వండినా లావు బియ్యం కావడంతో అన్నం ముద్దగా ముద్దగా తయారయ్యేదని తెలిపారు. ఈ ఏడాది సన్నబియ్యంతో వండిపెట్టడంతో విద్యార్థులు తృప్తిగా భోజనం చేస్తున్నారని తెలిపారు. మెనూ ప్రకారం సన్న బియ్యంతో వండిన వెజిటేబుల్ బిర్యానీ, ఉల్లగడ్డ కుర్మా, కోడిగుడ్డు ఫ్రై విద్యార్థులకు వడ్డించారు



ఆత్మకూరులో సంతోషంగా భోజనం చేస్తున్న విద్యార్థినులు

భోజనం రుచిగా ఉంది



మా పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంది. సన్న బియ్యం కావడంతో అన్నం మెత్తగా పొడిపొడిగా బాగుంది. కడుపు నిండా తృప్తిగా తింటున్నాం. మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారు. కూరలు కూడా రుచికరంగా ఉన్నాయి. కడుపునిండా తింటున్నాం. బాగా చదువుకుంటున్నాం.

- ఎన్ మౌనిక, 7వ తరగతి, ఆత్మకూరు

భోజనం చాలా బాగుంది



మా స్కూల్లో పెట్టే మధ్యా హ్న భోజనం చాలా బాగుంది. ఇంటి భోజనం ఉన్నట్లుగా ఉంది. సన్నబియ్యంతో వంట చేస్తున్నారు. తృప్తిగా తింటు న్నాం. భోజనం కావాలంటే మళ్లీ అడిగి పెట్టించుకుంటాం. చాలా సంతోషంగా ఉంది.

- షేక్ జమీర్, 8వ తరగతి, ఆత్మకూరు

బువ్వ భలే ఉంది..



అప్పుడు పెట్టే బువ్వ కంటే ఇప్పుడు పెడుతున్న బు వ్వ బాగుంది.మా ఇంట్లో తినే అన్నం కంటే బాగుంది. కొన్ని రోజుల నుంచి అన్నం బాగుండడంతో మేమంతా బాగా తింటున్నాం.రోజు ఇలాగే పెడితే బాగుంటుంది.

- పఠాన్ హబీబా,3వ తరగతి

హెల్పర్లుకు జీతం పెంచాలి



మధ్యాహ్న భోజన పథకం హెల్పర్లకు ప్రస్తుతం నెలకు రూ.4000 ఇస్తున్నారు. దాంతో ఎవరూ ముందుకు రావడం లేదు. మా పాఠశాలలో నలుగురు హెల్పర్లు ఉన్నారు. వారికి జీతం చాలదని పనిలోకి రాకపోతుంటే నేనే ఇంకొంత సొంత డబ్బులు ఇచ్చి పని చేసుంచు కుంటున్నా. టీడీపీ అధికారంలోకి వస్తే హెల్పర్లకు జీతం రూ. 5000కు పెంచుతామని హామీ ఇచ్చారు. అది అమలు చేయాలి. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తే సంతోషంగా ఉంటుంది.

- పఠాన్ షమీమ్, ఏజెన్సీ నిర్వాహకురాలు, ఆత్మకూరు

ఆదర్శ పాఠశాలలో భోజనం భేష్

అనంతసాగరం: ప్రభుత్వ పాఠశాలలకు కూటమి ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు, వారి తల్లిండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలను 'ఆంధ్రజ్యోతి' గురువారం మధ్యాహ్నం సందర్శించింది. విద్యార్థులకు వెజిటబుల్ బిర్యానీ, సాంబారు వడ్డించడంతో భోజనం బాగుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.



అనంతసాగరం ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సికిల్ సెల్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సికిల్ సెల్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. గురువారం నగరంలోని రాజాగారి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన ప్రదర్శన జరిగింది. ఆమె మాట్లాడుతూ 0 నుంచి 40 ఏళ్ల వయసున్న వారందరికి సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వైద్య బృందం ఇంటింటికి వస్తుందని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కాలనీల్లోని వారికి ఈ స్క్రీనింగ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా ట్రైబుల్ ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ నాగేంద్ర, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

'ప్రకాశం' కరస్పాండెంట్

కంచర్ల రామయ్య కన్నుమూత



కంచర్ల రామయ్య (ఫైల్)

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, సీనియర్ జర్నలిస్టు కంచర్ల రామయ్య (76) గురువారం సాయంత్రం కన్నుమూశారు. నెలరోజులుగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామయ్య మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్‌తో తనువు చాలించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల శ్రీకాంత్ తండ్రే కంచర్ల రామయ్య. కందుకూరు సమీపంలోని అత్తంటి వారిపాలెంలో సామాన్యరైతు కుటుంబంలో ఆయన జన్మించారు. ఓ ప్రముఖ దినపత్రికలో విలేకరిగా చేరి రాష్ట్రస్థాయి జర్నలిస్టుగా ఎదిగారు. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పారు. జర్నలిస్టుగా, విద్యావేత్తగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి కల్పనకు రామయ్య కృషి చేశారు. రామయ్యకు భార్య, కుమారులు విజయ్ శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.

• సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం

కంచర్ల రామయ్య మృతిపట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లతో పాటు పలువురు ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తంచేశారు. రామయ్య మృతి బాధాకరమని సీఎం చంద్రబాబు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. కంచర్ల రామయ్య మృతి దిగ్భ్రాంతి కలిగించిందని లోకేష్ పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, వివిధరంగాల ప్రముఖులు రామయ్య మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

• రేపు అంత్యక్రియలు

కంచర్ల రామయ్య అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మృతదేహాన్ని కందుకూరులోని ఆయన నివాసానికి తీసుకుని వస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్థివ దేహాన్ని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలకు తీసుకెళ్లి అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచుతారని వారు తెలిపారు. శనివారం ఉదయం కళాశాల ప్రాంగణంలోనే ప్రత్యేక ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మనుబోలు మండల మీట్

మనుబోలు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జలజాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పలు శాఖల ప్రగతి, పథకాల గురించి చర్చించనున్నామని, కావున ఎంపీటీసీలు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌వోలు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9551
వెండి కిలో ధర	రూ. 110500
వెండి ఒక గ్రాము	రూ. 113.50

రేషన్ డీలర్లతో తహసీల్దారు సమీక్ష

తోటపల్లిగూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం తహసీల్దారు బూదూరు పద్మావతి ఆధ్వర్యంలో ప్రభుత్వ చౌక దుకాణాల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దారు రేషన్ డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రతీనెల 1వతేదీ నుండి 15వతేదీ వరకు నిత్యావసర సరుకులు క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించి స్టాక్ రిజిస్టర్‌లో సరుకుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇకపై ప్రతినెల డీలర్లకు సమీక్షా సమావేశం ఉంటుందని, పూర్తి సమాచారంతో రావాలని తహసీల్దారు ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యశ్వంత్, మన్యం జితేంద్ర గౌడ్ హాజరయ్యారు.

'గండికోట'కు జలచైతన్య ప్రశంసాపత్రం



తహసీల్దారు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టడం, నీటి వనరుల పరిరక్షణ, నిర్వహణ, భూగర్భ జలమట్టం పెరుగుదల, ఇంకుడుగుంతలతో కలిగే ప్రయోజనాలపై సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ జలచైతన్యంపై ప్రశంసాపత్రం అందుకున్నారు. నీటి పొదుపు భావి తరాలకు మలుపు అనే అంశంపై నిర్వహించిన వెబినార్లో పాల్గొన్న గండికోటకు చత్తీస్‌గఢ్ రవిశంకర్ శుక్లా విద్యాలయం ఆన్లైన్ ద్వారా ఈప్రశంసాపత్రాన్ని అందజేశారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంఈఓలు దిలీప్‌కుమార్, వెంకటరత్నం, ఉపాధ్యాయులు, స్నేహితులు గండికోటను అభినందించారు.

కదలని పేదల ఇళ్లు

- హౌసింగ్‌లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- అధికారులతో కుమ్మక్కు
- ఏడాదిగా నిలిచిపోయిన నిర్మాణాలు
- రూ. లక్షల్లో పేదల సొమ్ము గోవిందా...

మనుబోలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కల నేరవేరుస్తామని ఐదేళ్లకొకసారి ఏర్పడిన ప్రభుత్వాలు చెపుతూనే ఉంటాయి. అందుకోసం రూ. కోట్లలో నిధులు వెచ్చిస్తూనే ఉంటాయి. అయితే పేదవాడి సొంతింటి కల మాత్రం ఎన్నేళ్లయినా నేరవేరడం లేదు. లోపం ఎక్కడ ఉందన్నది ప్రభుత్వాలు గుర్తించడం లేదు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపడం లేదు. దీంతో హౌసింగ్‌లో అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పేదల ఇళ్ల సొత్తు కాజేస్తున్నారన్నది ఇటీవల హౌసింగ్ అధికారుల సస్పెండ్ అవడంతో తేటతెల్లమైంది.

చదువురాని, అమాయక గిరిజనుల ఇళ్లనే కాంట్రాక్టర్లు టార్గెట్‌గా పెట్టుకుంటారు. అధికారుల వద్దనేమో తక్కువకే ఇళ్లు కట్టిస్తామని చెప్పి, గిరిజనుల నుంచి పత్రాలలో సంతకాలు చేయించుకుని, ఇంటికి సరిపడా సామగ్రి, బిల్లులు దండుకుని ఉడాయించేస్తున్నారు. ఈ తంతు జరిగి ఏళ్ళు గడుస్తున్నా గిరిజనులకు జరిగిన అన్యాయంపై పాలకులు, అధికారులు మిన్నకుండిపోతున్నారు. గిరిజనులు నోరెత్తినప్పుడల్లా కాంట్రాక్టర్లపై కేసు పెట్టామని, వచ్చి ఇళ్ళు కట్టిస్తారని చెప్పి నోళ్లు మూయించేస్తున్నారు. మండలంలో మనుబోలు, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో గిరిజనుల ఇళ్ళ నిర్మాణంలో రూ. లక్షల అవినీతి, అక్రమాలు జరిగాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ళ కోసం 19 పంచాయతీల్లో 20కిపైగా లేఅవుట్లు వేశారు. లేఅవుట్లు పూర్తవగానే 2020 డిసెంబర్ నుంచి పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వమే ఇళ్ళు కట్టిస్తుందని చెప్పడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షలకు స్వతహాగా ఇల్లు కట్టుకునేందుకు పేదలు ముందుకు రాలేదు. ఎప్పుడు నిర్మిస్తారని ఎదురుచూశారు. 2021లో ప్రభుత్వం కాంట్రాక్టర్లనే ఏర్పాటుచేసి పేదలు ఇళ్ళు నిర్మించేలా ఆదేశాలు ఇచ్చింది. దీంతో మనుబోలులో గిరిజనులకు చెందిన 30 ఇళ్లు నిర్మించేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే 20 ఇళ్ళను మాత్రం బేస్‌మెంట్ వరకు కట్టి వదిలేశారు. ఇళ్ళ నిర్మాణం వేగంగా చేయాలన్న అత్యుత్సాహంతో కాంట్రాక్టర్‌తో హౌసింగ్ అధికారులు 30 ఇళ్ళకు సరిపడా ఇసుక, స్టీల్, సిమెంట్ పూర్తిగా ఇచ్చేశారు. నిర్మాణాలు ప్రారంభించి 5ఏళ్ళు అవుతున్నా నేటికి ఇళ్ళ నిర్మాణం ముందుకు సాగలేదు. ఆ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



లింగారెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఇల్లు

అలాగే వీరంపల్లి పంచాయతీలోని లింగారెడ్డిపల్లిలో 25ఇళ్లు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2022 నుంచి ఇళ్ళ నిర్మాణం ప్రారంభించారు. కేవలం ఒక ఇల్లు మాత్రమే లబ్ధిదారుడి స్వంత డబ్బులతో కలిపి పూర్తిచేశారు. రెండు ఇళ్ళకు బండలు పోయగా ఆ బండ కుంగి దెబ్బతింది. మిగిలిన 22 ఇళ్ళు అసంపూర్తిగానే ఉన్నాయి. సాధారణంగా ఇల్లును నాలుగు దశల్లో నిర్మిస్తే ఆయా దశ దాటిన తరువాత అందుకు తగిన బిల్లును ప్రభుత్వం చెల్లిస్తుంది. ఒక్కో దశ దాటేందుకు ఈ కాంట్రాక్టర్‌కు ఒక్కో సంవత్సరం పట్టింది. గోడల దశలో ఉన్నప్పుడే నాణ్యత లేకపోవడంతో పగుళ్ళిచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అంటే ఏడాది నుంచి ఇళ్ళనిర్మాణం ఆపేశారు. అలాగే కాంట్రాక్టర్ కనపడటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. 25ఇళ్ళకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు హౌసింగ్ నుంచి రూ.24.39లక్షలు నగదు, సామగ్రి రూపంలో వెళ్లాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ గిరిజనులు మొండిగోడల వద్దనే మరల పూరిగుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరి పరిస్థితిని ఆ గ్రామ అధికారపార్టీ నాయకులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆయన ఇళ్ల నిర్మాణం పూర్తిపై హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసిం గ్ పీడీ, ఇతర అధికారులు పరిశీలించి గిరిజనుల దుస్థితిపై సదరు అధికారులకు నోటీసులు ఇచ్చారు. గతంలో పనిచేసిన హౌసింగ్ అధికారిని సస్పెండ్ చేశారు. సకాలంలో ఇళ్ళనిర్మాణా లు చేయకుండా, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా నిర్మాణాల కదలికపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఇల్లు పూర్తిచేయించా లని గిరిజనులు వేడుకుంటున్నారు.



నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పగుళ్లిచ్చిన ఇల్లు

ఏడాది నుంచి ఆపేశారు



నా ఇల్లు పూర్తిగా కట్టలా. ఏడాది నుంచి మేస్త్రీ రావడం లేదు. ఇంకెప్పటికీ కట్టిస్తారు. పాత ఇళ్లు ఉండేవి. ఉరుస్తున్నాయని కొత్తవి కట్టిస్తామని వాటిని కొట్టేశారు. అవి అయిన ఉంటే అందులో అయిన తలదాచుకునేవాళ్ళం కదా.

\- తాళ్లూరు వెంకటరమణయ్య, లింగారెడ్డి పల్లి

ఒక్కల ముక్కలుగా కట్టాడు



ఇల్లు కట్టే ఆయన ఒక్కల ముక్కలుగా కట్టాడు. సగం కట్టేసి వెళ్ళాడు. మేం ఎక్కడుండాలా?. మీరే చెప్పండి. ఓయమ్మ చాలా సంవత్సరాలనుంచి కడతానే ఉండాడు. ఆఫీసర్లయినా మా గురించి ఆలోచించాలా.

\- ఎల్లంపల్లి లక్ష్మమ్మ, లింగారెడ్డి పల్లి

ప్రతి బీజేపీ కార్యకర్త దేశం కోసం పరితపించాలి



మునులపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): ప్రతి బీజేపీ కార్యకర్త దేశం, ప్రభుత్వాస్తుల పరిరక్షణ కోసం పరితపించాలని బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు, పెనుబల్లి ఎంపీటీసీ సీహెచ్ వినయ్ నారాయణ అన్నారు. గురువారం మండలంలోని మునులపూడి గ్రామంలో 1,2 బూత్‌లలో భారత ప్రధానిగా నరేంద్ర మోడీ 11 ఏళ్ళ సుపరిపాలన, వివిధ రంగాలలో భారత్ సాధిస్తున్న అభివృద్ధి, సాహసోపేతమైన దేశ రక్షణ కోసం చేస్తున్న కృషిపై ఆపార్టీ నాయకులు, కార్యకర్తలతో కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా దేశం కోసం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెంచలకృష్ణ, కీలుకుప్ప శ్రీనివాసులు యాదవ్, శివకుమార్‌రెడ్డి, వీరనారాయణ, రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, అంకయ్య, చెన్నయ్య, శ్రీధర్, మూలే, భాష పాల్గొన్నారు.

●ఇందుకూరుపేట: సుపరిపాలన, పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం లక్ష్యమని మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని కుడితిపాలెంలో గురు వారం కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వ ర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు వెంపులూరు భాస్కర్‌గౌడ్ పాల్గొని స్థానిక నాయకులు, కార్యకర్తలు చేత ప్రతిజ్ఞ చేయించి అనం తరం ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా 11 సంవత్సరాల కాలంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు పరంధామయ్య, అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సుదీప్‌రెడ్డి, నెల్లూరు శ్రీనివాసులు, కూటమి నాయకులు అప్పాని శ్రీనివాసులు, వాళ్లమూడి చిన్నయ్య, దొడ్ల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

- వెంబడించి సమాచారమిచ్చిన జనసేన నాయకులు



గుంతలో వేస్తున్న చికెన్ వ్యర్థాలు

వెంకటాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి రవాణా శాఖ అధికారులు తనిఖీలలో భాగంగా చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టుకున్నారు. ఆ వాహనాలను జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తోపాటు ఆపార్టీ నేతలు వెంబడించి మరీ ఆర్టీవో అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో నెల్లూరు వైపు వెళ్తున్న నాలుగు వాహనాలను టోల్‌ప్లాజా వద్ద నిలిపి అధికారులు తనిఖీ చేశారు. వాటిలో చికెన్ వ్యర్థాలు ఉన్నట్లుగా గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీంతో గురువారం ఉదయం పోలీసులు గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న అడవి ప్రాంతంలో జేసీబీ సహాయంతో లోతైన గుంతను తీశారు. ఫిషరీష్ అధికారుల సమక్షంలో ఆ నాలుగు వాహనాలలో ఉన్న చికెన్ వ్యర్థాలను గుంతలో వేసి మట్టి పోసి పూడ్చిపెట్టారు. కాగా, చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

164 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 544 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 380 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-138, ఆర్‌ఆర్-14, సీఆర్-6, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 164 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి.

ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధయ్య

ముత్తుకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 30వతేదీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్కా రాధయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెద్ద ఎత్తున మండలంలో ఉన్న వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నగదు బదిలీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుపరచాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, పేద ప్రజలకు మనిషికి 10 కేజీల బియ్యం చొప్పున ఇవ్వాలని, మొబైల్ వాహనాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దుంపల ఏడుకొండలు, సభ్యులు పెద్దపూడి వెంకయ్య, షేక్.హిమాం సాహెబ్, పాల్గొన్నారు.

కొమ్మలపూడిలో ఘనంగా సీతారామ కల్యాణం

- పూజలు చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



సీతారామ కల్యాణంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): మండలం లోని కొమ్మలపూడి గ్రామంలో సీతా రామంజనేయ దేవస్థానం 14వ వార్షికోత్సవ బ్రహ్మో త్సవాల్లో భాగంగా గురువారం సీతా రామకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణంకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచ్చేశారు. గ్రామ టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొనగా వేదాశ్వీరచనం చేశారు. కల్యాణంకు కొండ్రెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రసూన్న దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ సీతారాముల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, మధునాయుడు, మస్తాన్‌నాయుడు, మన్నెమాల శ్రీనువాసులు రెడ్డి, మన్నెమాల ఆదినారాయణరెడ్డి, కొండ్రెడ్డి ఉమామహేశ్వరరెడ్డి, పెంచల్ రెడ్డి, శ్రీనువాసులు రెడ్డి, ఆలయ ఛైర్మన్ గూడలి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

జైల్లో పెట్టినంత మాత్రాన అభిమానం తగ్గదు



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి పూజిత

ముత్తుకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించినంత మాత్రాన కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న అభిమానం తగ్గదని ఆయన కూతురు కాకాణి పూజిత అన్నారు. గురువారం దువ్వూరుపాలెం వైసీపీ సీనియర్ నాయకుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డిని ఆమె పరామర్శించారు. సర్వేపల్లి ప్రజలు నాన్నపై ఉన్న అభిమానం, ఆప్యాయతను తనపై చూపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత చర్యలు ఆపాలన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి : ఇన్‌చార్జి ఎంపీడీవో

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చెయ్యాలని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి కోరారు. కావలి పట్టణ ఎమ్పీడీవో కార్యాలయంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలకు గాను 144 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అలాగే మండల స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించటం జరుగుతుందన్నారు.

తిక్కవరప్పాడులో అతిసార వ్యాధిపై అవగాహన



పిల్లలకు వివరిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ప్రవల్లిక

వెంకటాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మల్లుగుంట సంఘం ప్రాథమిక పాఠశాలలో గురువారం అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఈగలు వాలని ఆహార పదార్థాలను తీసుకోవాలని, తినే ఆహారపదార్థాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ప్రవల్లిక, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

బస్సు టైర్లు పంచర్ : త్రుటిలో తప్పిన ప్రమాదం



పగిలిన బస్సు టైర్లు

సంగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై, సంగం సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక రెండు టైర్లు ఒక్కసారిగా పేలడంతో తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివ రాల మేరకు నెల్లూరుకు చెందిన ఆర్టీసీ బస్సు సీతారామపురం నుంచి నెల్లూరుకు వెళ్తుంది. మార్గ మధ్యలో పెరమన క్రాస్ రోడ్డు దాటిన తరువాత బస్సు వెనుక ఉన్న రెండు టైర్లు ఒక్కసారిగా పేలి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా బ్రేక్‌లు వేసి నిలిపి వేశారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో ఎటువంటి వా హనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్ఐకి తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న ఎస్ఐకు ప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్‌ను నర్రవాడలోని వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు విధులు కేటాయించారు. గురువారం విధులు ముగించుకుని తన కారులో కలిగిరి వెళ్తుండగా బండకిందపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కారు ముందు టైరు పేలింది. దీంతో కారు రోడ్డుపై పల్టీలు కొట్టుకుంటూ పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. అటుగా వెళ్తున్న వారు గమనించి ఎస్ఐను కారులో నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ సురక్షితంగా బయటపడ్డారు.

చర్చి గోడను ఢీకొన్న బైక్

- వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన హజరత్తయ్య

ఏఎస్‌పేట, జూన్19 (ఆంధ్రజ్యోతి): చర్చి గోడకు బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం ఏఎస్‌పేట మండలంలోని వినాయక సెంటర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు వింజమూరు మండలం నందిగుంట గ్రామానికి చెందిన హజరత్తయ్య బైక్ మీద పందిపాడు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. వినాయక సెంటర్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చర్చి గోడకు ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య



గుర్తు తెలియని మృతదేహం

సైదాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.

రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ దక్షిణ యార్డు రెండవ నెంబరు ట్రాక్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు గల మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం గుర్తు తెలియని రైల్లో నుంచి పడి మృతిచెంది ఉండవచ్చని తెలిపారు. శరీరం చాలావరకు కుళ్ళిపోయిందని, మృతుని మెడలో ఎరుపు, నలుపు, పసుపు రంగుల దారాలకు ఆంజనేయస్వామి డాలర్ ఉందని, నల్లని నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేంకటేశ్వరరావు తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

సంగం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన ఆర్ మాల్యాద్రి, కిషోర్ అనే సోదరులు తనను కులం పేరుతో దూషించారని ఉడ్‌హౌస్‌పేట గ్రామానికి చెందిన ఉక్కాల వెంకటాద్రి గురువారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మాల్యాద్రి ఫిర్యాదు మేరకు ఇంటికి తూర్పు వైపు డాక్టర్ ఐవీ కృష్ణారెడ్డి ఆసుపత్రి ఉంది. తాను ఉదయం 10గంటలకు ఆసుపత్రికి వెళ్తుండగా డాక్టర్ కృష్ణారెడ్డితో మాల్యాద్రి సోదరులు అమర్యాదగా మాట్లాడడం చూసి డాక్టర్‌తో అలా అమర్యాదగా మాట్లాడడం మంచిది కాదని చెప్పినందుకు నాతో గొడవపడటం జరిగిందని, అంతేకాకుండా తనను కులం పేరుతో దుషించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటారుబైక్ బోల్తాపడి వైసీపీ నేతకు గాయాలు

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ బుడంగుంట క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం మోటారుబైక్ అదుపుతప్పి బోల్తాపడి వైకుంఠపురానికి చెందిన వైసీపీ నాయకుడు పరుసు మాళికి గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ: కాగా, ప్రమాదంలో పరుసు మాళి గాయపడ్డాడన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య విషయాన్ని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించి నెల్లూరులోని వైద్యులతో మాట్లాడారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515



పార్కుల నిర్వహణ బాధ్యత ప్రజలదే !

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నిధులు సమీక రించి, పార్కుల ను అభివృద్ధి చేసి ప్రజలకు అంకిత మిస్తామని, ఆ తరువాత వాటి నిర్వహణ బాధ్యత ప్రజలదేనని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి స్పష్టం చే శారు. గురువారం 21,22,23 డివిజన్లలో నూతన పార్కుల ఏర్పాటుకు స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులతో కలిసి శంకుస్థాపన చేశారు.

పార్కు కాస్తా అడవిలాగైంది!



నగరంలో ప్రసిద్ధ బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు పక్కన ఉన్న పర్యాటక శాఖ పార్కు అడవిని తలపిస్తోంది. ఇక్కడ ఆట వస్తువులు మొదలు కూర్చునే బల్లల వరకు మొత్తం పిచ్చి మొక్కలు కమ్మేశాయి. కనీసం నడిచే బాట కూడా కనిపించనంతగా చెట్లు, పొదలు పెరిగిపోయాయి. వీటివల్ల విషకీటకాల సంచారం పెరిగింది. పార్కు అధ్వానంగా మారడంతో పిల్లలు ఆడుకోలేని పరిస్థితి నెలకొంది. కాసేపు సేదతీరుదామన్నా కూర్చునేందుకు సరైన బల్లలు లేవు, అపై ఎటు నుంచి ఏ పాము వస్తుందోనన్న భయం! వెరసి ఈ టూరిజం పార్కు కాస్తా ఫారెస్ట్‌గా మారింది. అధికారులు చొరవ చూపి దీనిని బాగు చేయవలసిన అవసరం ఉంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



న్యూస్ బాక్స్

అత్యాధునిక పద్ధతుల్లో మోకీలు మార్పిడి

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతుల్లో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోకాలి నొప్పితో నిత్యం బాధపడేవారికి మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు ఎంతో ఉపయోగకరమని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ కుమార్‌బాబు, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సందేశ్‌రెడ్డి తెలిపారు. మోకీలులోని మూడు భాగాలు దెబ్బ తిన్నప్పుడు వాటిని లోహపు, ప్లాస్టిక్ ఇంప్లాంట్లతో భర్తీ చేస్తామని చెప్పారు. రోగులకు ఎలాంటి నొప్పి లేకుండా శస్త్రచికిత్స నిర్వహిస్తామని వెల్లడించారు.

ఫీజు రాయితీ కోసం కలెక్టర్‌కు వినతి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇసనాకుల మల్లికార్జున ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టర్ ఆనంద్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ ఫీజు రాయితీ అందించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, ప్రదీప్, మనోజ్, సురేంద్ర, అభిషేక్ పాల్గొన్నారు.

బ్యాగులు, పుస్తకాల పరిశీలన

నెల్లూరు (వైద్యం) జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన బ్యాగులు, పుస్తకాలను టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు గురువారం పరిశీలించారు. నగరంలోని 47వ డివిజన్‌లో ఒకే కుటుంబంలో ముగ్గురికి తల్లికి వందనం పథకం కింద నగదు జమ కావటంపై సంతోషం వ్యక్తం చేశారు. గురువారం వారి నివాసానికి వెళ్లి పుస్తకాలు, బ్యాగులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్, మునికృష్ణ, కంచి కృష్ణ, సునీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' ఇవ్వాలి

● సీపీఐ సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని సీపీఐ నెల్లూరు నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున వేస్తామని చెప్పిన ప్రభుత్వం రూ.13 వేలు మాత్రమే వేసిందని విమర్శించారు. చాలా మంది తల్లుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదన్నారు. అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, షాజహాన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బీఈడీ కళాశాలలో 'యోగాంధ్ర'



యోగా సాధన చేస్తున్న బీఈడీ విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో సదస్సు, శిక్షణ ఏర్పాటు చేశారు. విద్యార్థులు యోగా సాధన చేశారు. యోగాను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణవ యోగ సంస్థ గురువు ఆనందరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం రవీంద్రబాబు, అధ్యాపకులు లక్ష్మీప్రసన్న, వైయల మందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో యోగా, స్వచ్ఛాంధ్రపై అవగాహన

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 : యోగా, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు పీడీ లీలారాణి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవంతోపాటు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వీటిల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపడాలి

● ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు



పారిశుధ్య పర్యవేక్షకులతో శ్రీనివాసులు

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడాలని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆసుపత్రిలోని ఆయన చాంబర్‌లో పారిశుధ్య పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి రోజూ వందలాది మంది రోగులు వస్తుం టారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దార్ల మల్లికార్జున కూడా పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

● సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచలనర్సయ్య

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బా రెడ్డి కూరగాయల మార్కెట్‌లో ఉన్న మరుగుదొడ్లను వెంటనే వినియోగం లోకి తీసుకురావాలని సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మార్కెటింగ్ శాఖ సెక్రటరీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. మార్కెట్‌లో మరుగుదొడ్లు నిరుప యోగంగా ఉండటంతో చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, సురేష్, రమణయ్య, గంగరాజు, సయ్యద్ బాషా, గిరి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

'ఆర్టీఈ' రెండో విడత లాటరీ నేడు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అడ్మిషన్లకు శుక్రవారం రెండో విడత లాటరీ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీఈ కింద ఒకటో తరగతి అడ్మిషన్లకు 37,427 మంది దరఖాస్తు చేసుకుంటే, 28,561 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. తొలి విడత లాటరీలో 23,118 మందికి సీట్లు కేటాయించగా, 15,541 మంది పాఠశాలల్లో చేరారన్నారు. మిగిలిన విద్యార్థులకు రెండో విడత లాటరీ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. అడ్మిషన్ లభించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. ఈనెల 30లోగా పాఠశాలల్లో అడ్మిషన్లు నిర్ధారించుకోవాలన్నారు.

23న ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ల ఫలితాలు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ఆర్జీయూకేటీ క్యాంపస్‌లలో అడ్మిషన్ సాధించిన విద్యార్థుల వివరాలను ప్రభుత్వం ఈనెల 23న ప్రకటించనుంది. 50,500 మంది అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంవత్సరం పదో తరగతి మూల్యాంకనంలో కొన్ని పొరపాట్లు రావడంతో ఈ నెల 2 నుంచి 10 వరకు దరఖాస్తులకు రెండోసారి అవకాశం కల్పించారు. ఆ సమయంలో 1,021 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఆర్జీయూకేటీల్లో 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రెండేళ్ల ఇంటర్మీడియట్‌తో కలిపి ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సులు ఇక్కడ ఉంటాయి.

అహోబిల మఠం భూమికి విముక్తి

● దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న 1,80 ఎకరాలు
● మఠానికి స్వాధీనం చేసిన రెవెన్యూ అధికారులు
● బోర్డు ఏర్పాటు.. ఆ వెంటనే ధ్వసం చేసిన ఓ వ్యక్తి
● పలు సెక్షన్ల కింద కేసు నమోదు

నెల్లూరు(సిటీ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అహోబిల మఠం భూమికి ఎట్టకేలకు విముక్తి లభించింది. ఆ భూమిని అధికారులు మఠానికి అప్పగించడంతో గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. అయితే సదరు బోర్డును గ్రామస్థుడు ఒకరు ధ్వంసం చేయడమేకాక మఠం ప్రతినిధులకు హెచ్చరికలు చేయడంతో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

తమిళనాడులోని తాంబరానికి చెందిన రంగనాథయతీంద్ర మహాదేశికన్ అహోబిల మఠం సెలయార్‌కు 1.80 ఎకరాల భూమి నెల్లూరు రూరల్లోని కనుపర్తిపాడు వద్ద పూరాతన ఆస్తిగా ఉంది. దీనిని దశాబ్దాల క్రితం కొందరు ఆక్రమించుకున్నారు. 1991లో తమ భూములు ఆక్రమణకు గురయ్యాయని గుర్తించిన మఠం ప్రతినిధులు అప్పట్నుంచి అధికారులకు అర్జీలిస్తూ ఇచ్చారు. వారి ప్రయత్నానికి ఫలితం దక్కింది. సర్వే నెం. 295లోని 1.80 ఎకరాల భూమి మఠానిదేనని రూరల్ రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు గురువారం మఠం ప్రతినిధులతో కలిసి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే 2007లో మఠానికి సంబంధం లేని వ్యక్తులు ఓ సంస్థ పేరిట ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేశారని తెలుసుకున్న మఠం అధికారులు అధికారులపై ఒత్తిడి పెంచారు. అయినా స్పందన కరువైంది. తాజాగా సర్వే చేసి తమ భూముల హద్దులు తేల్చాలని తహసీల్దారుకు విన్నవించుకో వడంతో రంగంలోకి దిగిన సర్వే బృందాలు 295 సర్వే నెంబరులోని 1.80 ఎకరాల విస్తీర్ణం మఠానిదేనని డైక్లాట్ ఆధారంగా తేల్చారు. దీంతో బోర్డులు పెట్టారు. కాగా, ఈ అంశం రాజకీయంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ భూ వ్యవహారం వెనుక వైసీపీకి చెందిన ఓ మాజీ ఎంపీ హస్తం ఉన్నట్లు ప్రచారం జోరందుకోవడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, సదరు భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ. 10 కోట్ల వరకు ఉంటుందని ప్రచారం.



భూమిని స్వాధీనం చేసుకుంటూ బోర్డు పెడుతున్న అహోబిలం ప్రతినిధి, వీఆర్వో రమణయ్య

బోర్డు ధ్వంసం, బెదిరింపు

రాజకీయవర్గాల్లో ఉడుకుపుట్టిస్తున్న కనుపర్తిపాడు వద్దనున్న అహోబిలం స్థలం వద్ద వివాదం రేగింది. మఠానికి చెందిన వరదరాజన్ నాటిన బోర్డును ఓ వ్యక్తి ధ్వంసం చేయడంతో అతనిపై నెల్లూరు రూరల్ పోలీసులు బలమైన చట్టాల కింద కేసు నమోదు చేశారు. వరదరాజన్ ట్రాక్టర్‌తో సదరు భూమిలో దుక్కి చేయిస్తుండగా నాగేంద్రరెడ్డి అనే వ్యక్తి అక్కడకి వెళ్లి అతనిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన స్థానిక వీఆర్వో దారా వెంకట రమణయ్య ఆ భూమి మఠానిదే అని చెప్పగా అతనిపైనా నాగేంద్రరెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఆ భూమి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందినదని, ఎవరైనా ఇందులోకి అడుగుపెడితే ట్రాక్టర్‌తో తొక్కించాల్సి వస్తుందని బెదిరించి వెళ్లిపోయాడు. ఈ మేరకు జరిగిన అంశాన్ని ఫిర్యాదు రూపంలో నెల్లూరు రూరల్ పోలీసులకు వీఆర్వో తెలియచేయగా నాగేంద్రరెడ్డిపై నూతన సెక్షన్ల ప్రకారం 329(3), 126(2), 132, 292, 351(2)ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. కాగా నాగేంద్రరెడ్డి మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అత్యంత సమీప బంధువుగా ప్రచారం జరుగుతోంది.

ఎవరు ఈ ఆదాల....?

కనుపర్తిపాడులోని సర్వే నెంబరు 295లో 1.80 ఎకరాల భూమి అడంగళ్ల రెడ్డిఅండ్‌రెడ్డి డెవలపర్స్ పేరిట ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అనుభవదారుడి పేరిట ఆదాల, సన్ ఆఫ్ శంకర్‌రెడ్డిగా ఉన్నట్లు తేల్చారు. ఆదాల అని మాత్రమే ఉండటం, పేరు పూర్తిగా లేకపోవడంతో ఎవరు ఈ ఆదాల...? అంటూ అధికారవర్గాలు, రాజకీయ వర్గాల్లో చర్చమొదలైంది. పైగా ఈ భూముల సమీపంలో నెల్లూరు మాజీ ఎంపీ, వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన భూములు ఉన్నట్లు ప్రచారం జరగడంతో అన్నీ వర్గాల్లోనూ మరింత ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ విషయమై తహసీల్దారు కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా తమ దగ్గర ఉన్న పత్రాలలో పరిశీలించగా రెడ్డిఅండ్‌రెడ్డి డెవలపర్స్ వ్యక్తి పేరు దగ్గర ఆదాల, సన్‌ఆఫ్ శంకర్‌రెడ్డి ఉన్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామని తెలిపారు.

కరపత్రాల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా నగరంలోని చిన్నబజారు పరిధిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో గురు వారం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. మోదీ సాధించిన విజయాలు, పేదలకు అం దించిన సంక్షేమం గురించి వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు యశ్వంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దువ్వూరు పరుశురాం, మండల అధ్యక్షుడు హేమంత్ కుమార్, శౌరి శ్రీనివాసులు, రాజ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో జరుగుతున్న నిర్మాణాల్లో నాణ్యతను పాటించాలని కమిషనర్ నందన్ సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో వేగం పెంచాలని, ఇంటింటా చెత్త సేకరణకు అవసరమైన వాహనాలను సమకూర్చి. వాటి నిర్వహణ బాధ్యతలను కూడా కాంట్రాక్టర్లే చూసుకోవాల న్నారు. నగరంలో డివైడర్ల నిర్మాణం, డివైడర్లకు రంగులు, వాటర్ ట్యాంకులకు పెయింటింగ్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ముందుగా బారాషహీద్ దర్గా వద్ద గంధ మహోత్సవానికి ఏర్పాట్ల పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కాగా, 18వ డివిజన్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంహెచ్‌వో చైతన్య పరిశీలించారు.

కంచర్ల రామయ్య మృతి తీరని లోటు : వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : విద్యావేత్త, కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రా మయ్య మృతి తీరని లోటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్ర శాంతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాత్రి కేయునిగా జీవితాన్ని ప్రారంభించి, కళాశాల కరస్పాండెంట్‌గా వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

చికెన్ వేస్ట్ వాహనాలను అడ్డుకుంటాం

● జనసేన నగర అధ్యక్షుడు సుజయ్



మాట్లాడుతున్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చికెన్ వేస్ట్ తరలిస్తున్న ముఠా అడ్డుఅదుపు లేకుండా వ్యవహరిస్తోందని, చికెన్ వేస్ట్ వాహనాలను అడ్డుకుంటామని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు. ఆ పార్టీ నగర కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. గోదావరి జిల్లాల తర్వాత రొయ్యలు, చేపల సాగుకు అనువైన ప్రదేశం నెల్లూరు జిల్లా అని చెప్పారు. చేపలు సాగు చేస్తున్న రైతులు లాభాల కోసం చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తుండటంతో భూములు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. చికెన్ వేస్ట్ తరలిస్తున్న ముఠాపై, ఉపయోగిస్తున్న రైతులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో తాము వాహనాలను అడ్డుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బెపల్లి సురేష్ నాయుడు, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, షేక్ అలియా, సర్వేపల్లి ఏఎంసీ డైరెక్టర్ భవాని నాయుడు, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

● ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు ఆరిఫ్‌బాషా 3, ధృవకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రేవంత్‌రెడ్డి 86పరుగులు, పర్మాద్‌ఖాద్రి 56 పరుగులు సాధించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి, భరత్ వంశీకృష్ణ, అర్జున్ టెండూల్కర్

వైభవంగా వెంగమాంబ తిరునాళ్ల

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమైన వెంగమాంబ ప్రదానోత్సవం గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా పచ్చవ వంశీయులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య సారెను తీసుకొచ్చి అమ్మవారికి అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

● **ఉత్సాహంగా బండలాగుడు పోటీలు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కి చెందిన ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి ఎడ్లు ప్రథమస్థానం, కడప జిల్లా మైదుకూరుకి చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎడ్లు ద్వితీయ స్థానం, కడప జిల్లా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారశీల గురివిరెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఎం.రమేష్‌బాబుయాదవ్ ఎడ్లు తృతీయస్థానం సాధించాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు 4వ స్థానం, నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన గొట్టికే హేత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లు 5వ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంగమాంబ సేవాసమితి, భక్తమండలి, పూర్వ విద్యార్థులు, పలువురు దాతలు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

వ్యవసాయ డిప్లమోకు దరఖాస్తు గడువు పెంపు

అనంతసాగరం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సు చేరేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు సోమశిల అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ కే పల్లంరాజు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9441206497ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నారు. రెవెన్యూ డే నిర్వహించడానికి అంగీకరించిన కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు తదితరులకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాపరిపాలనకు రెవెన్యూశాఖ అంకితం

● ప్రభుత్వ శాఖలన్నింటికీ తలమానికం ● నేడు రెవెన్యూ దినోత్సవం

కోవూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ ప్రధానమైంది. ప్రజలకు ప్రభుత్వ సేవలందించేందుకు, ప్రజాసమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకం. రెవెన్యూ సర్వీసెస్ డే (రెవెన్యూ దినోత్సవం)ను ప్రతీ ఏటా జూన్ 20న ఉద్యోగులు నిర్వహించుకుంటారు. ఈసందర్భంగా ప్రజాసేవకు పునరంకితమవుతామంటూ ప్రతిజ్ఞ పూనుతారు. ప్రతీ ఏటా నామమాత్రంగా నిర్వహిస్తుండగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిధుల్ని కేటాయించడంతో ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



కోవూరులోని తహసీల్దారు కార్యాలయం

238 సంవత్సరాల ఘన చరిత్ర

బ్రిటీష్ ప్రభుత్వం 1786వ సంవత్సరం జూన్ 20న దేశవ్యాప్తంగా 'బోర్డు ఆఫ్ రెవెన్యూ' ను ఏర్పాటుచేసింది. దీంతో దేశంలో రెవెన్యూ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోంది. అంతకు పూర్వము నుంచే దేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉన్నట్లు ఆధారాలున్నాయి. భక్తరామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న 1680 ప్రాంతంలో తహసీల్దారుగా పనిచేస్తూ భద్రాచలంలో ఆలయనిర్మాణాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సిన భూమి శిస్తుతో కట్టించి గోల్కొండనవాబు ఉత్తర్వులతో కటకటాల పాలైన చరిత్ర అందరికీ తెలిసిందే.

రెవెన్యూ ఉద్యోగులే కీలకం

భూ సమస్యల పరిష్కారమే కాదు. ఎన్నో సేవల్ని రెవెన్యూ వ్యవస్థ అందిస్తోంది. నిత్యావసర వస్తువుల పంపిణీ, ఎన్నికల ప్రక్రియ, విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల్ని ఆదుకోవడం లాంటి ప్రధాన అంశాలన్నింటిలోనూ రెవెన్యూ ఉద్యోగులే కీలకం. జిల్లాలో శంకరన్ లాంటి కలెక్టర్లను, మండలాల్లో సేవలందించిన తహసీల్దార్ల సేవలను సింహావలోకనం చేసుకుంటారు.

చెక్కుచెదరని కార్యాలయాలు

రెవెన్యూ వ్యవస్థలో ప్రధానమైనవి తహసీల్దారు కార్యాలయాలు. కోవూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు పట్టణాల్లో 125 సంవత్సరాల కిందట బ్రిటీషు వారు నిర్మించిన తహసీల్దారు కార్యాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గతంలో రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన 'జమాబందీ' ఈ కార్యాలయాల్లోనే జరిగేవి. కాలంతోపాటు అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ కార్యాలయాలు చెక్కుచెదరక సేవలందిస్తుండటం గమనార్హం.

ఎంతో సంతోషంగా ఉంది



రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల్ని కేటాయించడం సంతోషంగా ఉంది. రెవెన్యూ శాఖలో చేరినప్పటి నుంచి అంకితభావంతో పనిచేస్తున్నాము. ప్రజలకు సేవలందించడంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటాము. వానొచ్చినా, వరదొచ్చినా మేము సేవలందిస్తాము. ఇరవైనాలుగు గంటలూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటాము.

-- సునీల్ కుమార్, అటెండరు, తహసీల్దారు కార్యాలయం, కోవూరు

సాంకేతికతను రైతులకు చేరువ చేయాలి

● యంత్రపరికరాల పంపిణీలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి అవసరమైన, అందుబాటులో ఉన్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను రైతులకు చేరువ చేయాలని కలెక్టర్ ఆనంద్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. నెల్లూరులోని ముత్తుకూరురోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీ కింద యంత్ర, పరికరాలను ఆయన రైతులకు అందజేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 1452 యంత్రపరికరాలను రైతులకు అందజేశామని చెప్పారు. వాటి మొత్తం విలువ రూ.6,80,48,750లుకాగా అందులో రూ.2, 86,96,220లు రాయితీగా మంజూరైనట్లు పేర్కొన్నారు. పొలంలో మట్టి నమూనాల సేకరణ నుంచి పంట చేతికందే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన శాస్త్రీయపరమైన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన పరికరాలను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలకు సూచించారు. నియోజకవర్గాల వారీగా అందించిన పరికరాల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ రీజనల్ మేనేజర్ విద్యాసాగర్, శాస్త్రవేత్త వినీత, ఏడీ సర్వోజీరావు, అనిత, కన్నయ్య, శివనాయక్, ఏవో మంజుల తదితరులు పాల్గొన్నారు.



పరికరాల పనితీరును కలెక్టర్ ఆనంద్‌కు తెలియజేస్తున్న డీఏవో సత్యవాణి

రాహుల్‌తోనే దేశాభివృద్ధి

● కాంగ్రెస్ నాయకులు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :భారతదేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే అది కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో రాహుల్‌గాంధీ 55వ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, దేశభద్రత, మహిళా సాధికారత, యువత అభ్యున్నతి వంటి వాటికి పెద్దపీట వేస్తున్నది రాహుల్‌గాంధీయే అని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో దేశం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లాంబాక మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, హుస్సేన్‌బాషా, సత్తనపల్లి బాలయ్య, కిశోర్, రెహ్మాన్, నసీమా, రాజేష్‌రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన నడుమ ఏఎన్‌ఎంల రీ కౌన్సెలింగ్

● మరో రెండు యూనియన్లను హైకోర్టు గుర్తించటంతో గందరగోళం
● కలెక్టర్‌కు తమ గోడు వెల్లడించిన నర్సులు ● రీకౌన్సెలింగ్ రద్దు చేయాలంటూ ఆందోళన

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. బుధవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జూమ్ ద్వారా 134 మంది ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ జరిగింది. అయితే తమను గుర్తించటం లేదని హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్, అసోసియేషన్, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నెల 18న హైకోర్టు బదిలీల్లో ఈ రెండు యూనియన్లను గురించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యయన్ బదిలీల్లో ఈ యూనియన్‌లను కూడా గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారమే ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ పూర్తి చేసిన వైద్యాధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం 19 రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో ఏఎన్‌ఎంలు వైద్య ఆరోగ్యశాఖ అధికారి వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే రీ కౌన్సెలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. అయితే హైకోర్టు ఆదేశాలు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అధికారులు నచ్చచెప్పినా వారు వినలేదు.

యూనియన్లకు డబ్బులు చెల్లించిన వారెందరో..

ఇదిలా ఉంటే యూనియన్ సిఫార్సు లెటర్‌కు ఆయా యూనియన్‌లకు పెద్ద సంఖ్యలో ఏఎన్‌ఎంలు ముడుపులు చెల్లించి సిఫార్సు లెటర్లు తెచ్చినట్లు సమాచారం. ఏపీ ఎన్‌జీవో సంఘంతో పాటు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 134 మంది ఏఎన్‌ఎంలలో 30 శాతం వరకు ముడుపులు తీసుకుని అప్పటికప్పుడు సిఫార్సు లెటర్లు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా బదిలీలు జరుపుకున్న యూనియన్ నేతలు తమకు సంబంధించిన ఏఎన్‌ఎంలను వారు కోరుకున్న చోటికి బదిలీ చేయించుకున్నారు. దీంతో సిఫార్సు లెటర్లు లేని వారు ఈ చర్యను తీవ్రంగా అడ్డుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అయితే ఉన్నట్టుండి హంస అసోసియేషన్‌కు, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు కోర్టు ద్వారా అనుమతులు తెచ్చు కోవటంతో కేవలం హంస యూనియన్ మాత్రం ఏఎన్‌ఎంలకు సిఫార్సు లెటర్లు ఇచ్చింది. దీంతో గురువారం రీ కౌన్సెలింగ్ జరగటంతో తాము కోరుకున్న చోటికి బదిలీకానివారు తీవ్ర నిరసనను తెలియచేశారు.



ఏఎన్‌ఎంలకు రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన ఏఎన్‌ఎంలు

పలువురు ఏఎన్‌ఎంలు కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. బదిలీల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ గోడు వెళ్లబోసుకున్నారు. ఏకంగా 71 మందికి సిఫార్సు లెటర్లు ఇచ్చారని, వారికి తొలి ప్రాధాన్యత ఇస్తే జిల్లా కేంద్రానికి ఎక్కడో మారుమూల ప్రాంతాలలో 10 నుంచి 15 ఏళ్లగా పని చేస్తున్న తమకు దగ్గరగా వచ్చే అవకాశం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్లు అర్హత లేని వారికి లెటర్లు ఇచ్చాయని ఆందోళన చేశారు. దీనిపై కలెక్టర్ ఆనంద్ స్పందించారు. వైద్యాధికారులకు ఫోన్ చేసి నిబంధనల ప్రకారమే బదిలీల కౌన్సెలింగ్ చేయాలంటూ హెచ్చరించారు. దీనికి వైద్యాధికారులు జవాబిస్తూ ఈ కౌన్సెలింగ్‌లో తమ ప్రమేయం ఏమీ లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా యూనియన్ సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలియచేశారు. 47 సిఫార్సు లెటర్లకు ప్రాధ్యాన్యత ఇచ్చి బదిలీలు చేస్తున్నామని వారు ఈ సందర్భంగా వివరించారు.

రూ.8 కోట్లు వెచ్చించినా ఏంలాభం ?

● చిట్టడవిలా పేదల ఇళ్ల స్థలాలు ● చిల్లచెట్లతో నిండిన కొండికందుకూరు లేఅవుట్
● దొంగల పాలైన విద్యుత్ తీగలు, ఇతర సామగ్రి ● స్థానికులకు పట్టాలివ్వాలంటున్న సర్పంచి

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పేదలకోసం మండలంలోని కొండికందుకూరు వద్ద 14 ఎకరాల్లో గత జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్ నిరుపయోగంగా మారింది. ఈ లేవుట్‌కు భూమి కొనుగోలు, మెరక చేయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ. 8 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. అనంతరం కందుకూరులోని 1,080 కుటుంబాల వారికి అక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అంతేకాక కొన్ని గృహాలకు కాంట్రాక్టర్లతో బేస్‌మెంట్ల నిర్మాణం కూడా హౌసింగ్ అధికారులు పూర్తిచేయించారు. అయితే పట్టణానికి సుదూరంగా ఉన్న ఇక్కడ నివసించేందుకు ఒక్క కుటుంబం కూడా ముందుకు రాలేదు. దీంతో ఆలేవుట్ నేడు నిరుపయోగంగా మారింది.



● అడవిలా మారింది !

రెండేళ్లుగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు లేకపోవటంతో చిల్లచెట్లు దట్టంగా పెరిగి అడవిలా మారింది. దీంతో ఈ లేఅవుట్ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉండటమేకాక అక్కడ మౌలిక సదుపాయాల కోసం ఏర్పాటుచేసిన పరికరాలన్నీ దొంగల పాలవుతున్నాయి. గృహనిర్మాణాల కోసం ఏర్పాటుచేసిన పైపులు, నీటి ట్యాంకులను దొంగలు ఎత్తుకెళ్లిపోగా, ఇటీవల ఆ లేఅవుట్‌లోని విద్యుత్ వైర్లను కూడా పూర్తిగా దొంగలు చోరీచేశారు. కొండికందుకూరు గ్రామానికి సమీపంలో ఉన్న ఈ లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం కోసమే రూ. 60 లక్షలకు పైగా వెచ్చించి ప్రత్యేకంగా విద్యుత్‌లైను లాగటంతోపాటు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ లేఅవుట్‌లో ఒక్క విద్యుత్‌తీగ కూడా లేకుండా దొంగలు అపహరించుకుపోయారు. మరికొద్దిరోజులుపోతే ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కూడా కనిపించవని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకే పట్టాలివ్వాలి

14 ఎకరాల్లో అన్ని మౌలిక సదుపాయాలతో లే అవుట్‌ను అభివృద్ధి చేశారు. స్థానిక పేదలకు పట్టాలుఇస్తే ఈలేవుట్ వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కొండికందుకూరుసమీప గ్రామాల్లో నివాసస్థలం లేని నిరుపేదలు ఎందరో ఉన్నారు. వారందరికీ ఇక్కడ పట్టాలు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొండికందుకూరు సర్పంచి కుమ్మర బ్రహ్మయ్య

బోగోలులో విజిలెన్స్ అధికారుల దాడులు

● 950 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బొగ్గుదిబ్బల కాలనీలో విజిలెన్స్ సీఐ నరసింహరావు, విజిలెన్స్ తహసీల్దారు క్రిష్ణప్రసాద్‌లు గురువారం తనిఖీలు నిర్వహించారు. గుర్రంకొండ రాకేష్ ఇంట్లో తనిఖీలు చేయగా 950 కేజీల రేషన్ బియ్యం గుర్తించినట్లు వారు తెలిపారు. రాకేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నించేలోపు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకుని సమీపంలోని రేషన్‌షాపులో అప్పగించారు. ఆర్ఐ రామ్‌కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భోజ్యా తెలిపారు.



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

జిల్లాలో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ : జాయింట్ కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితర పథకాలను పొందటంలో ఎదురతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ధారించిన ఫీజు రూ.500ను మినహాయింపు ఇచ్చి, కేవలం నామమాత్రపు దరఖాస్తు ఫీజు రూ. 50ను సంబంధిత గ్రామ సచివాలయంలో చెల్లించిన వారికి జాయింట్ పట్టాదారుల భూములకు ఉచితంగా సబ్ డివిజన్ చేయిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30లోగా అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆయనపై అంత ప్రేమెందుకో...?

(3వ పేజీ తరువాయి)

రిజక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.8 కోట్ల బిల్లులు చెల్లించారు. దీంతో ఆ బిల్లులను రికవరీ చేయాల్సిందిగా క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా జరిగి ఇప్పటికి పదేళ్లు కావస్తోంది.

● విజిలెన్స్ చెప్పినా లెక్కలేదు..!

క్వాలిటీ కంట్రోల్ సీఈ ఇచ్చిన నివేదిక ప్రకారం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో 2017లో ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్క్‌పై విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో అనేక అవకతవకలు వెలుగుచూశాయి. నాణ్యత లేకుండా రోడ్డు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని నిర్ధారించారు. ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్ చేత మరోసారి రోడ్డు వేయించడంతో పాటు రికవరీ చేయాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. అలానే ఇందుకు బాధ్యులైన ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలంటూ గతేడాది మే నెలలో ఆర్‌అండ్‌బీ సెక్రటరీకు అప్పటి విజిలెన్స్ డీజీ నివేదిక అందజేశారు. ఆ తర్వాత ఆర్‌అండ్‌బీ సెక్రటరీ నుంచి ఈఎన్‌సీకు ఆదేశాలు వెళ్లాయి. ఏడాది కాలంగా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకుండా డ్రామాలు ఆడుతున్నారు. కింది నుంచి పైకి, పైనుంచి కిందకు ఫైల్‌ను తిప్పుతూ కాలం గడుపుతున్నారు. ఈ వర్కు విషయంలో చర్యలు తీసుకోకపోవడానికి ఆఖరుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) కూడా తప్పుబట్టింది.

● మంత్రి ఆదేశాలూ బేఖాతర్

రోడ్డు విషయంలో అధికారుల తీరును గతేడాది పలు కథనాల రూపంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తూ, రోడ్డు బాగు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైనాన్ని బయటపెట్టింది. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. ఎందుకు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం లేదు..? ఎందుకు మళ్లీ లేయింగ్ వేయడం లేదో.. ఐదు రోజుల్లోపు వివరణ ఇవ్వాలంటూ ఆర్‌అండ్‌బీ ఎస్ఈను ఆదేశించారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా మంత్రికి సమాధానం ఇవ్వకపోవడమే కాకుండా కనీసం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం గానీ, ప్రజా సొమ్మును రికవరీ చేయడం గానీ చేయలేదు.

సీఈకు నివేదించాం

ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని నెల్లూరు ఈఈకు సూచించాం. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూ ఈఈ ఇచ్చిన నివేదికను సీఈకు పంపాం. ఎంత మేర రికవరీ చేయాలన్నది వారు నిర్ణయిస్తారు. తదుపరి ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

- గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

జిల్లా గ్రంథాలయానికి త్వరలో రూ.3 కోట్లు మంజూరు

● గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమయ్యే రూ.3కోట్లను త్వరలో మంజూరు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఏ కృష్ణమోహన్ వెల్లడించారు. ఆయన గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పోటీ పరీక్షల మెటీరియల్, గ్రంథాలయంలో సౌకర్యాలపై గ్రంథాలయ పాలకులతో చర్చించారు. శనివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం ఫ్లెక్సీలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజాతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు

ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ విచారణ

కావలి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యుల వ్యవహార శైలి, అభియోగాలు, ఆసుపత్రి నిర్వహణ లోపాలపై గురువారం విజిలెన్స్ విచారణ జరిగింది. విజిలెన్స్ ఆఫీసర్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ బీసీకె నాయక్ పర్యవేక్షణలో స్వీపర్ స్థాయి నుంచి డాక్టర్ స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సహా ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 8గంటల వరకు జరిగింది. వైద్యుల మధ్య ఆధిపత్య పోరు సమన్వయ లోపం, ఇటీవల కాలంలో ఆసుపత్రిలో జరిగిన పలు అభివృద్ధి పనుల నిధుల విషయంలో ఆరోపణలు, ఆసుపత్రి కమిటీ వైద్యాధికారుల మధ్య సమన్వయ లోపాలు వెరసి ఆసుపత్రి నిర్వహణ గాడి తప్పడం, ఆసుపత్రి వ్యవహారం రాష్ట్రస్థాయికి చేరింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కర్నాటి రోహిత్ తనకు సంబంధంలేని విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారని అందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారన్న ఆరోపణపై ప్రధానంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై విజిలెన్స్ అధికారులను ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా అన్ని అంశాలపై ఆరోపణలున్న మాట వాస్తవమేనని, వాటిపై విచారణ జరుపుతున్నామని వివరణ ఇచ్చారు.



సిబ్బందిని విచారిస్తున్న విజిలెన్స్ కమిటీ

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు సీతారాముల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి రోజు గణపతి, కలశ పూజ పుణ్యహవచనం, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు, శనివారం సీతారాముల కల్యాణోత్సవం, గ్రామోత్సవం, ఆదివారం వసంతోత్సవం, ఉట్టిమహోత్సవం, పారువేట, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9535
వెండి కిలో ధర	రూ. 112700
వెండి ఒక గ్రాము	రూ. 115.70

నేడు షిరిడీసాయి వార్షిక వేడుకలు

సంగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో వెలసి ఉన్న షిర్డిసాయిబాబాకు ఆరవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయాన్నే స్వామి వారికి విశిష్ట పూజలు, ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం. సాయంత్రం సాయిబాబా గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంగం ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్లకు గురువారం నుంచి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై అసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు జూలై 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు జూలై 21వ తేదిన ఆత్మకూరు పాలిటెక్నికల్ కళాశాల, సంగం ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజన్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం భారత జాతీయ రహ దారుల అధికారుల సంస్థ డైరెక్టర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి సంగం మండలం జెండా దిబ్బ నుంచి జిల్లా సరిహద్దు ప్రాంత మైన బాట వరకు విస్తరించి ఉందని తెలిపారు. జాతీయ రహదారి నిర్వహణ చాలా అధ్వా నంగా ఉందని, ప్రమాద హెచ్చరికలు లేక పోవడంతో ప్రమాదాలు జరుతుగుతున్నా యన్నారు. అంతేకాకుండా సైన్ బోర్డులు, రోడ్డు మార్కింగ్, లైటింగ్, గుంతలు పూడ్చక పోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆత్మ కూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహ దారి అభివృద్ధి పనులు చేపట్టి అవసర మైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు సర్వేపల్లి, ఉదయగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేఖరులతో మాట్లా డుతూ వలసవాసుల ఆరాధ్యదైవమైన వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉందన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. అయితే ఆలయం వద్ద భక్తులకు తగినన్ని వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రస్తుతం రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయ న్నారు. ఈ నిధులతో వసతుల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని కలిసి మరో రూ.4 కోట్లు నిధుల మంజూరుకు చర్యలు చేపడతామ న్నారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల సమయానికి భక్తుల సౌకర్యార్థం కొన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు పేలపూడి వెంకట రత్నం, బయ్యన్న, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, ఉండేలా గురవా రెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కాకర్ల



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పురొంపిదొడ్లలో వెలసి ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనము, నవగ్రహ మండపారాధన, సహస్ర దీపాలంకరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 21న హోమాలు, మహానివేదన, గ్రామోత్సవం 22న వాల్మీకి, కుంకుమపూజ, పొంగళ్ల నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టడం జరుగుతుందన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవలో ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే కాకర్లతో పర్చూరు ఎమ్మెల్యే వేలూరు సాంబశివరావు

వింజమూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవిభూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, పర్చూరు ఎమ్మెల్యే వేలూరు సాంబశివరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రదక్షిణలు చేసి పురోహితుల ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఆలయ చైర్మన్ లెక్కల చిన్నకొండారెడ్డి వేదపండితులు అతిథులకు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో లెక్కల లక్ష్మీకాంతమ్మ, ఉండేలా గురవారెడ్డి, చీకుర్తి రవీంద్రబాబు, కాకర్ల వెంకట్, మాలేపాటి చైతన్య, నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండల సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

సీతారామపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మం డల కో-ఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల నాయకులు గురువారం వింజ మూరులోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మండల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎల్వీఆర్ కాలేజి కూడలి వద్ద నుంచి హైస్కూల్ వరకు డబుల్ రోడ్డు, ముస్లింలు మృతదేహాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉందని, అక్కడ రోడ్డు, బ్రిడ్జి మంజూరు చేయించాలని, అలాగే మండలంలో నీటి సమస్య అధికంగా ఉండడంతో ఓవర్ హెడ్ ట్యాంకులను మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, మాజీ కన్వీనర్ మొత్తం శెట్టి చెన్నకేశ వులు, మండల కో-ఆర్డినేటర్ చింతల శ్రీనివా సులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ,ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, చంద్రరెడ్డి, తోట మనో జ్ ,తోట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి

ఉదయగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ప్రజల నుంచి సకాలంలో పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఆత్మకూరు డీఎల్‌పీవో షేక్ నయీం తెలిపారు. గురువారం మండలంలోని గండిపాళెం, వెంగళరావు నగర్ పంచాయతీలకు సంబం దించిన పలు రికార్డులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లల్లో పంచాయతీ కార్యదర్శులు చురుకుగా ఉండాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజు తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకట్రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నయీం

అభివృద్ధికి సహకరించాలని వినతి

ఉదయగిరి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉదయగిరి ప్రాంత అభివృద్ధికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తనవంతుగా సహకరించాలని యూడీఎఫ్ ప్రతినిధులు వీఎస్ఆర్ మూర్తి, ఎండీ ఖాజా అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ పారిశ్రామికంగా ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో వేలాది ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉదయగిరిలోని కల్యాణ మండపాన్ని ఆధునీకరణ చేయడంతో పాటు రంగనాయకుల స్వామి ఆలయం, కల్యాణ మండపాన్ని పునరుద్ధరించాలని, వీటితో పాటు వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో కల్యాణ మండపాలను నిర్మిస్తే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నల్లగొండ్ల, సిద్ధేశ్వరం, భైరవకోన ఆలయాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా గుర్తింపు లభిస్తుందని వారు వినతి పత్రంలో కోరారు.

పీ-4లో ఆర్థిక ప్రమాణాలు పెంపొందించుకోవాలి

● ఆర్డీవో పావని

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి, బంగారు కుటుంబాలు దత్తతస్వీకర్తలు అందజేసిన ఆర్థిక సహాయంతో తమ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని ఆర్డీవో బీ పావని తెలిపారు. గురువారం ఆమె చెర్లోయడవల్లి గ్రామానికి వెళ్లి జ్ఞానమ్మ కుటుంబ సభ్యుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జ్ఞానమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మర్రిపాడు మండలం, పడమటినాయుడుపల్లికి చెందిన సాహో ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు ఇటీవల జ్ఞానమ్మ కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందజేశారన్నారు. ఆ నగదుతో వారు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తుండడం సంతోషకరమన్నారు. జ్ఞానమ్మ కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేశామని, వారి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.



జ్ఞానమ్మ కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో పావని

యోగా నిర్వహణ స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

అనంతసాగరం జూన్ 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించేందుకు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 16 సచివాలయాల పరిధిలో 144 చోట్ల యోగాదినోత్సవం నిర్వహించేలా ప్రణాళిక చేసిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వాలి

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన టీచర్లకు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో 117 జీవో వల్ల ఏర్పడిన పోస్టుల్లోకి వెళ్లిన టీచర్లకు కొన్ని నెలలపాటు జీతాలు రాలేదని, ఇప్పుడు అలాంటి సమస్య తలెత్తకుండా ట్రెజరీతో సమన్వయం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎంటీఎస్ టీచర్లను సొంత మండలాల్లో సర్దుబాటు చేయాలి

మరోవైపు మినిమం టైమ్ స్కేలు ప్రాతిపదికగా పనిచేస్తున్న 1998, 2008 డీఎస్సీ టీచర్లను సొంత మండలాల్లో లేదా సమీప మండలాల్లో సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. వారిని సొంత లేదా సమీప మండలాల్లోనే నియమిస్తామని గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

నరుకుడు.. చంపుడు వైసీపీ సిద్ధాంతం..!

● ప్రజల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ ధ్యేయం

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నరుకుడు.. చంపుడు వైసీపీ సిద్ధాంతంగా ఆ పార్టీ నేతలు ముందుకెళ్తున్నారు. రెండురోజుల క్రితం సత్తెనపల్లిలో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు 2029లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గంగమ్మతల్లి జాతరలో రప్పా రప్పా నరికినట్లు ఒక్కొక్కడిని నరుకుతాం.. అంటూ బహిరంగంగా ప్లే కార్డులు ప్రదర్శించడం వైసీపీ వికృత చేష్టలకు ప్రత్యక్ష నిదర్శనం. ఇకనైనా వైసీపీ క్షుద్ర రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆత్మకూరు టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ మాట్లాడుతూ ఏడాది ఎన్డీఏ కూటమి పాలనలో సంక్షేమం. అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తూ ప్రజల మన్ననలను పొందారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పక్కా ప్రణాళికతో సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాలు అమలుల్లోకి రానున్నాయని తెలిపారు. పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆత్మకూరును మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తోడేటి వెంకటయ్య, రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి వైసీపీ నేతలకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పులిమి శైలజారెడ్డి, పరిటాల సత్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు మాదాల మస్తాన్‌నాయుడు, టీడీపీ నేతలు పల్లవోలు జయాకర్, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

● ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు అరీఫ్‌బాషా 3, ధ్రువకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, ఫర్మాద్‌ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి, భరత్ వంశీకృష్ణ, అర్జున్ టెండూల్కర్

వెల్డర్లకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిక్స్ ఓవర్సీస్ సంస్థతో కలిసి రాష్ట్రంలోని వెల్డర్లకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 45 ఏళ్ల వరకు వయస్సు గల ఐటీఐ లేదా ఐటీసీ చేసిన పురుషులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. వెల్డింగ్ సర్టిఫికెట్‌తో పాటు కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలని, నెలకు రూ.51,939 నుంచి రూ.61,365 వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. వీసా, విమాన టిక్కెట్లు, వైద్య సౌకర్యాలను ఉద్యోగ సంస్థ భరిస్తుందన్నారు. వీసా ప్రక్రియ కోసం రూ.35 వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 29 వరకు ఏపీనైపుణ్యం, స్కిల్‌నేషనల్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

34 వేల మంది ఎస్జీటీలకు శిక్షణ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు 60 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఈనెల 23 నుంచి 28 వరకు శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. 131 కేంద్రాల్లో 34 వేల మంది ఎస్జీటీలకు నాన్-రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.

C.R.I.M.E N.E.W.S

బస్సు టైర్లు పంచర్ : త్రుటిలో తప్పిన ప్రమాదం



పగిలిన బస్సు టైర్లు

సంగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముం బాయి జాతీయ రహదారిపై, సంగం సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక రెండు టైర్లు ఒక్కసారిగా పేలడంతో తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివ రాల మేరకు నెల్లూరుకు చెందిన ఆర్టీసీ బస్సు సీతారామపురం నుంచి నెల్లూరుకు వెళ్తుంది. మార్గ మధ్యలో పెరమన క్రాస్ రోడ్డు దాటిన తరువాత బస్సు వెనుక ఉన్న రెండు టైర్లు ఒక్కసారిగా పేలి పెద్ద శబ్ధం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా బ్రేక్‌లు వేసి నిలిపి వేశారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో ఎటువంటి వా హనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్ఐకి తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న ఎస్ఐకు ప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్‌ను నర్రవాడలోని వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు విధులు కేటాయించారు. గురువారం విధులు ముగించుకుని తన కారులో కలిగిరి వెళ్తుండగా బండకిందపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కారు ముందు టైరు పేలింది. దీంతో కారు రోడ్డుపై పల్టీలు కొట్టుకుంటూ పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. అటుగా వెళ్తున్న వారు గమనించి ఎస్ఐను కారులో నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ సురక్షితంగా బయటపడ్డారు.

చర్చి గోడను ఢీకొన్న బైక్

● వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన హజరత్తయ్య

ఏఎస్‌పేట, జూన్19 (ఆంధ్రజ్యోతి): చర్చి గోడకు బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం ఏఎస్ పేట మండలంలోని వినాయక సెంటర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు వింజమూరు మండలం నంది గుంట గ్రామానికి చెందిన హజరత్తయ్య బైక్ మీద పంది పాడు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. వినాయక సెంటర్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చర్చి గోడకు ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య



గుర్తు తెలియని మృతదేహం

సైదాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.

రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ దక్షిణ యార్డు రెండవ నెంబరు ట్రాక్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు గల మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం గుర్తు తెలియని రైల్లో నుంచి పడి మృతిచెంది ఉండవచ్చని తెలిపారు. శరీరం చాలావరకు కుళ్ళిపోయిందని, మృతుని మెడలో ఎరుపు, నలుపు, పసుపు రంగుల దారాలకు ఆంజనేయస్వామి డాలర్ ఉందని, నల్లని నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేంకటేశ్వరరావు తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

సంగం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన ఆర్ మాల్యాద్రి, కిషోర్ అనే సోదరులు తనను కులం పేరుతో దూషించారని ఉడ్‌హౌస్‌పేట గ్రామానికి చెందిన ఉక్కాల వెంకటాద్రి గురువారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మాల్యాద్రి ఫిర్యాదు మేరకు ఇంటికి తూర్పు వైపు డాక్టర్ ఐవీ కృష్ణారెడ్డి ఆసుపత్రి ఉంది. తాను ఉదయం 10గంటలకు ఆసుపత్రికి వెళ్తుండగా డాక్టర్ కృష్ణారెడ్డితో మాల్యాద్రి సోదరులు అమర్యాదగా మాట్లాడడం చూసి డాక్టర్‌తో అలా అమర్యాదగా మాట్లాడడం మంచిది కాదని చెప్పినందుకు నాతో గొడవపడటం జరిగిందని, అంతేకాకుండా తనను కులం పేరుతో దుషించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటారుబైక్ బోల్తాపడి వైసీపీ నేతకు గాయాలు

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ బుడంగుంట క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం మోటారుబైక్ అదుపుతప్పి బోల్తాపడి వైకుంఠపురానికి చెందిన వైసీపీ నాయకుడు పరుసు మాళికి గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ: కాగా, ప్రమాదంలో పరుసు మాళి గాయపడ్డాడన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య విషయాన్ని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించి నెల్లూరులోని వైద్యులతో మాట్లాడారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 530

రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తా..!

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా గుడ్లూరు మండల రెగ్యులర్ వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న బి రవికుమార్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న టి అబ్రహంలింకన్ పామూరు మండల వ్యవసాయ అధికారిగా బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు రవికుమార్‌ను ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా నియమించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ అందుబాటులో ఉంటూ వారికి అవ సరమైన సూచనలు అందిస్తూ అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు.

మరమ్మతులకు నోచుకోని సాగునీటి చెరువులు

● మాగాణి భూములకు అందని నీరు
● ఆయకట్టు రైతుల అవస్థలు

వలేటివారిపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి చెరువులు మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా చెరువుల్లో చిల్లచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారి పాలెం మండలంలోని బంగారక్కపాలెం, చుండి, అయ్యవారిపల్లె అంకభూపాలపురం, పోకూరు, నలదలపూరు, శాఖవరం, వలేటివారిపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల్లో చిల్లచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. అంతేగాకుండా చెరువులకు వర్షం నీరు వచ్చే కాలువల్లో కూడా చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో చెరువుల్లోకి వర్షంనీరు సక్రమంగా పారడం లేదని, అడవి పందులు సంచరిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా



వలేటివారిపాలెం రామన్నచెరువులో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

చెరువు కట్టలపై చెట్లు, పుట్టలు పెరిగి కట్టలు బలహీనపడ్డాయి. వరదనీరు భారీగా చేరితే చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా చెరువుల అలుగులు కూడా ధ్వంసం అయ్యాయి. చెరువుల్లో చిల్లచెట్లు తుమ్మచెట్లు ఏపుగా పెరగడంతో వరదనీరు నిల్వ ఉండే అవకాశాలు కూడా లేవు. దీంతో ఆయకట్టు చివరి భూములకు నీరు సరఫరా అయ్యే అవకాశాలు లేవని రైతులు వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం:త్రివిక్రమ్, ఇరిగేషన్ ఏఈ

మండలంలోని 38 సాగునీటి చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. వాటిలో నాలుగు చెరువులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అవి కూడా ఒక్కో చెరువుకు నాలుగు లక్షలు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగిలిన చెరువులకు నిధులు మంజూరు కాలేదు.

న్యూస్ బాక్స్

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో అమ్మవారు

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరులో ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం



శ్రీదేవీ, భూదేవితో చెన్నకేశవస్వామి.

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రమైన కుమ్మర వీధిలో కొలువై ఉన్న చెన్నకేశవస్వామి, వీరాంజనేయస్వాముల ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిసాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవిలతో చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ఉభయకర్తలుగా చక్కా నారాయణ కుటుంబ సభ్యులు, వల్లూరు రవీంద్రబాబు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్ కూల్చివేత

● గ్రామస్థుల హర్షం



వాటర్ ట్యాంక్ కూల్చివేతను పరిశీలిస్తున్న గ్రామస్థులు.

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలో శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్‌ను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూల్చివేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాటర్‌ట్యాంక్ కూల్చివేత విషయమై బుధవారం గ్రామానికి చెందిన గోరంట్ల రాంబాబు, కొంపల్లి వెంకటేశ్వర్లు మరికొందరు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్ శ్రావణ్‌కుమార్ వాటర్ ట్యాంక్ కూల్చివేయాలని అధికారులకు సూచించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్‌ట్యాంక్‌ను కూల్చివేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్‌కు సామగ్రి అందజేత



కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు సామగ్రిని బహూకరించిన పూర్వ విద్యార్థులు

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు రూ.80 వేల విలువైన సామగ్రిని బహూకరించారు. గురువారం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో 1994-99 విద్యా సంవత్సరంలో ఈ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు బక్కముంతల ఓంకారం, మైలా ప్రసాద్, మద్దా బాలు పూర్వ విద్యార్థుల ప్రతినిధులుగా రూ.50 వేలు విలువైన సౌండ్‌సిస్టమ్, రూ.30 వేల విలువైన 60 కుర్చీలు ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావుకు అందించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాధవరావు పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే దగుమాటి పరామర్శ

కావలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష కుటుంబాన్ని గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఖాదర్‌బాష (ఇట్టు) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఖాదర్‌బాష నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు.



టీడీపీ నేత ఖాదర్‌బాషా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

జర్నలిస్ట్ నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను గురువారం కావలి ఎమ్మెల్యే దగుమటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. నాగేశ్వరరావు సోమవారం రాత్రి అకాల మరణం చెందటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, అమరావేదగిరి, పోతుగంటి శ్రీకాంత్, ఆర్యవైశ్య, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

● రోడ్డు బురదమయం ● ప్రజల అవస్థలు

కావలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఆర్వోబీ పక్కన ఉన్న చర్చి సమీపంలో ఉన్న మంచినీటి పైపులైన్ గురువారం మరలా పగిలి రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అంతేకాకుండా నాసిరకం పైపులైన్ల ఏర్పాటు వలన తరచూ పైపులైన్లు పగులుతూ కావలి పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల లోపు మూడు పర్యాయాలు ఒకే చోట పైపులైన్ పగిలింది. గతనెల 24వ తేదీన పైపులైన్ పగిలిపోవటంతో దానిని మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించే సరికి నాలుగు రోజులు పట్టింది. దీంతో ఆ నాలుగు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే మరలా అదేచోట జూన్ 1వ తేదీ పైపులైన్ పగిలిపోయింది. దీంతో మరలా మరమ్మతులు పనులు చేపట్టి దానిని పూడ్చకుండా పర్యవేక్షణ నిమిత్తం అలాగే వదిలి వేశారు. మరలా గురువారం పైపులైన్ పగలటంతో వెంటనే మరమ్మతులు చేపట్టారు. కాగా, తరచూ పైపులైన్‌లు పగిలిపోతుండటంతో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి చొరవతీసుకుని దెబ్బతిన్న పైపులైన్ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన ఐరన్ పైపులైన్ వేసేందుకు పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించేలాగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పైపులైన్ పగిలి బురదమయంగా మారిన రోడ్డు

డయేరియా నివారణపై అవగాహన కల్పించాలి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): డయేరియా నివారణపై గ్రామస్థాయిలో ప్రజలకు పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి సూచించారు. ఈసందర్భంగా గురు వారం స్థానిక పీహెచ్‌సీలో అతి సారా వ్యాధి నివారణ చర్యలకు సంబంధించి గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ఐదు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు ఉన్న ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు డయేరియాపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అతిసారా సోకిన చిన్నారులకు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎవరికైనా అతిసారా సోకినట్లయితే ఏఎన్ఎంలు లేదా ఆశా కార్యకర్తలకు సమాచారం అందించి వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. చిన్నారులకు తల్లిపాలు శ్రేష్ఠమని, తల్లిపాలతోపాటు పౌష్టికాహారం అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సకాలంలో వ్యాధినిరోధక టీకాలు చిన్నారులకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్ సాయిలక్ష్మి, స్టాఫ్‌నర్స్ జి స్వప్న, హెల్త్ అసిస్టెంట్‌లు నారాయణరాజు, క్రిష్ణయ్య, పద్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలను ఉంచాలి



చినపవనిలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి రవికుమార్

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణాల డీలర్లు ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి బి రవికుమార్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని చినపవని గ్రామంలోని శ్రీ లక్ష్మీ సాయిబాబా ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. షాపులోని రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



అల్లూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చెయ్యాలని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి కోరారు. కావలి పట్టణ ఎమ్పీడీవో కార్యాలయంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలకు గాను 144 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అలాగే మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కృష్ణారావు, ఏపీఎం చంచయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

●అల్లూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లూరు ఎంపీడీఓ రజనీకాంత్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో, యోగా గురువులతో సమావేశం నిర్వహించారు. శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధికమంది హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎంపిక చేసినవారి వివరాల ఆధారంగా వారికి వసతులను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, యోగా గురువులు మల్లికార్జున, కొప్పు శ్రీనివాసులు, దమ్మాల బ్రహ్మానందరావు, శ్రీహరిరెడ్డి, పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కరపత్రాల ఆవిష్కరణ



వికసిత్ భారత్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ 11 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా కరపత్ర ఆవిష్కరణ గావించామన్నారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు బ్రహ్మనందం, జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలు ఆవిష్కరించడం జరిగిందని, ప్రతి కార్యకర్త బూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేసి ప్రచారం నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందించిన సహాయ సహకారాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళేందుకు కరపత్రాలు పంపిణీ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ మాల్యాద్రి, సవీంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సీఐ చొరవతో రహదారిపై గుంతల పూడ్చివేత

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కలిగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకటరమణ చొరవతో కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారుప్రాంతం వద్ద ఎన్నో ఏళ్ళుగా దుస్థితిలో ఉన్న రహదారి కష్టాలకు గురువారం ఉపశమనం కలిగింది. మే నెల 29న దుస్థితిలో గ్రామీణ రహదార్లు- పట్టించుకోని అధికార్లు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. ఈ క్రమంలో అప్పటినుంచి స్థానికులు రోడ్డు నిర్మాణానికి తమ వంతు ప్రయత్నాలు చేయడం జరిగింది. ఈ సమస్య పోలీసు శాఖవద్దకు వెళ్ళడంతో స్పందించిన సీఐ, ఎస్ ఉమాశంకర్‌తో కలిసి రహదారి దుస్థితిని పరిశీలించారు. చిన్నపాటి వర్షం వచ్చినా వారంరోజులపాటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు, దుర్వాసనలతో తాము పడు తున్న ఇబ్బందులు స్థానికులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. మురుగునీటిలో నడవడానికి వీలులేక మహిళలు, వృద్ధులు పడుతున్న కష్టాలకు చలించిన సీఐ వెంకటరమణ వెంటనే టిప్పర్ల ద్వారా రెడ్‌మిక్స్ తరలించి గుంతలను పూడ్పించి స్థానికుల కష్టాలు తొలగించారు. తమ కష్టాలు తొలగడంతో వాహనదారులు, స్థానికులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు.



రెడ్‌మిక్స్‌తో గుంతలు పూడ్చిన తర్వాత రోడ్డు

వైభవంగా వెంగమాంబ తిరునాళ్ల

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమైన వెంగమాంబ ప్రదానోత్సవం గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా పచ్చవ వంశీయులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య సారెను తీసుకొచ్చి అమ్మవారికి అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

● ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కి చెందిన ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి ఎడ్లు ప్రథమస్థానం, కడప జిల్లా మైదుకూరుకి చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎడ్లు ద్వితీయ స్థానం, కడప జిల్లా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారశీల గురివిరెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఎం.రమేష్‌బాబుయాదవ్ ఎడ్లు తృతీయస్థానం సాధించాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు 4వ స్థానం, నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన గొట్టికే హేత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లు 5వ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధి కారులు విజయవంతంగా నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంగమాంబ సేవాసమితి, భక్తమండలి, పూర్వ విద్యార్థులు, పలువురు దాతలు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు



శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

● భోజ్యా, కప్పరాళ్లతిప్ప ఎస్సై

ఇంటర్వ్యూ

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎస్సై భోజ్యా అన్నారు.

? దాడులు, అల్లర్లపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గొడవలు జరిగేలా ఉంటే ముందస్తు చర్యలు చేపడతాం, పరస్పర దాడులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. ఆకతాయల అల్లర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

? మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు.

! రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం.

? నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. గ్రామ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. అలాగే సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

164 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 544 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 380 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-138, ఆర్‌ఆర్-14, సీఆర్-6, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 164 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.245.40గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.



జస్ట్.. మాక్‌డ్రిల్

రాత్రివేళ.. చెట్టుపక్కన తుపాకులతో నక్కి పరిసరాలను గమనిస్తున్న భద్రతా సిబ్బందిని చూశారా? ఉగ్రవాదుల కదలికలను పసిగడుతూ ఇలా ముందుకు అడుగులేస్తున్నారు. ఇదంతా నిజం అనుకునేరు.. జస్ట్, మాక్ డ్రిల్ మాత్రమే. తిరుమలలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ కార్యక్రమం వివరాలు

- 4లో

రేపటి యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(విశ్వవిద్యాలయాలు/క్రీడలు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్వీయూ తారకరామ స్టేడియంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆ రోజు ఉదయం 5.45 నుంచీ 7.15 గంటల వరకూ యోగాసనాలు వేయనున్నారు. దీనికోసం యూనివర్సిటీ నుంచి మూడు వేల మంది, జిల్లా అధికార యంత్రాంగం మరో నాలుగు వేల మందిని సమీకరిస్తోంది. స్టేడియంను పరిశుభ్రంగా మార్చి, కార్పెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. యోగా నిపుణులు, సహాయకులను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమాన్ని డ్రోన్లతో చిత్రీకరించనున్నారు. ఇక్కడి ఏర్పాట్లను గురువారం కమిషనరు మౌర్య పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రెండు రోజుల పాటు వాకర్స్, ఇతర క్రీడాకారులను మైదానంలోకి అనుమతించడం లేదన్నారు. ఆమె వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసీకుమార్ తదితరులున్నారు.

ఎవరైనా అనుమానాస్పద స్థితిలో కనిపించారంటే చాలు.. పోలీసులు వారి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. అలాగే, పాఫిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్ర వేయగానే ఆ వ్యక్తులకు నేరచరిత్ర ఉంటే తెలిసిపోతుంది. ఇక, నేరఘటనల్లో వేలిముద్రలను ట్యాలీ చేసి నిందితులను పట్టుకునేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇటీవల మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు ఇలాగే పట్టుకున్నారు. - తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



అనుమానముంటే వేలి ముద్ర వేయాల్సిందే



పాఫిలాన్



లైవ్ స్కానర్ ద్వారా వేలిముద్రల సేకరణ.. పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

- గత నెలలో 1650 మంది నుంచి సేకరించిన పోలీసులు
- నిందితుల గుర్తింపులో కీలకంగా పాఫిలాన్, లైవ్ స్కానర్లు

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరగాళ్లు పోలీసులను ఏమార్చేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మరోవైపు పోలీసులూ వారిని పట్టుకునేందుకు.. భవిష్యత్తులో దొంగతనాలకు పాల్పడినా గుర్తించేలా సాంకేతికతను అంది పుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న పాపిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్రలు, అరచేతి ముద్రలు సేకరిస్తున్నారు. ఈ వివరాలు నేరగాళ్లను గుర్తించడంలో పోలీసులకు సహాయ పడుతున్నాయి. గతంలో వేలి ముద్రలు సేకరించే పనులు చాలా మందకొడిగా సాగేవి. ఇటీవల నేరాలు పెరగడం, గంజాయి, బహిరంగంగా మద్యం తాగడం, మహిళలు, వేధింపులు, చిన్నారులపై అఘాయిత్యాలు, ఇంటి దొంగతనాలు, దోపిడీలు, ద్విచక్ర వాహనాల చోరీ, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్‌లు, పిక్‌ప్యాకెట్లు పెరిగాయి. పాఫిలాన్‌తో పాటు లైవ్ స్కానర్లను వినియోగించి ఈ ఘటనల్లో నిందితులను గుర్తించే పనులు చేపట్టారు. అదే సమయంలో అనుమానితుల వేలి ముద్రలు సేకరించే పనులూ సాగుతున్నాయి. గత నెలలో దాదాపు 1650 మంది వేలి ముద్రలు సేకరించారు. ఇలా వేలి ముద్రల సేకరణలో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్పీ హర్షవర్ధన్‌కు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందనలు తెలుపుతూ కీపిటప్ అని ప్రశంసించారు.

- ఇటీవల తిరుచానూరు, తిరుపతి ఈస్ట్ పరిధిలో జరిగిన మారుతీ షోరూముల్లో దోపిడీ ఘటనల్లో వేలి ముద్రల ఆధారంగానే మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.
- తిరుపతిలోని విష్ణునివాసంలో రోజూ 20 నుంచి 30 మొబైల్ ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యేవి. బాధితులు ఫిర్యాదు ఇవ్వడం తప్ప న్యాయం జరిగిన ఘటనలు చాలా తక్కువ. ఈ క్రమంలో విష్ణునివాసంలో లైవ్ స్కానర్ ఏర్పాటు చేసి అనుమానితులు, పాత నేరస్థుల వేలి ముద్రలు సేకరించే పనులు చేపట్టారు. ఇలా విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద వారం కిందట 15 మందిని ఒకసారి, ఐదుగురిని మరోసారి గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 20 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. దీంతో అక్కడ దొంగతనాలు తగ్గు ముఖం పట్టాయి.

జిల్లాలో 13,187 సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, మారుమూల పల్లెలు, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నాలుగు నెలలుగా దాదాపు 13,187 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గరుడ ఫ్లైఓవర్‌పై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగి పోవడం, ఆకతాయిల ఆగడాలు ఎక్కువ కావడం, అర్ధరాత్రి పూట మత్తు పదార్థాల వినియోగం పెరగడంతో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. త్వరలో ఇంకా కీలకమైన ప్రదేశాల్లో అమర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో బిక్షగాళ్ళ సందడి, నేరస్థుల కదలికలు తగ్గుముఖం పట్టాయి. విష్ణునివాసంలో బంగారం ఉండే బ్యాగు తీసుకెళ్తుంటే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు.

'కొండ'పై భక్తులకు మరిన్ని ఉచిత బస్సులు



బస్సులో ప్రయాణిస్తున్న అధికారులు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను ట్యాక్సీ దోపిడీ నుంచి రక్షించేలా మరిన్ని ఉచిత బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలో ప్రస్తుతం 10 శ్రీవారి ధర్మరథాలు(ఉచిత బస్సులు) అందుబాటులో ఉన్నాయి. ఇవి తిరుమలలోనే ఉంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తుంటాయి. ఇటీవల తిరుమలలోని ట్యాక్సీలు భక్తులను నుంచి అధిక మొత్తం ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్న క్రమంలో టీటీడీ ఓ నూతన ఆలోచన చేసింది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులను కూడా ఫ్రీ సర్వీసుకు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి ఆర్టీసీ అధికారులు అంగీకారం తెలపడంతో తొలిదశలో గురువారం 80 ఆర్టీసీ బస్సులను ఉచిత రవాణాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులకు ట్యాక్సీల ఛార్జీల భారం తగ్గించడంతో పాటు తిరుమలలో పర్యావరణ పరిరక్షణ, వాహన శబ్ద కాలుష్య నివారణకు ఈ విధానం ఉపయోగంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీలో ఉచిత ట్రిప్పులను గురువారం ప్రారంభించి.. ఆ బస్సులో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, టీటీడీ రవాణా జీఎం శేషారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరావు, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ శ్రీహరి తదితరులు కొంతదూరం ప్రయాణించారు.

ఏయే ప్రాంతాల్లో తిరుగుతాయంటే..

తిరుపతి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తొలుత తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌కు చేరుకుంటాయి. అక్కడ ప్రయాణికులు దిగాక.. అదే బస్సు శ్రీవారి ధర్మరథాలు తిరిగే రూట్‌లోకి ప్రవేశిస్తుంది. శంఖుమిట్ట(ఎస్ఎంసీ), వైకుంఠం 1, ఎస్వీ గెస్ట్‌హౌస్, కృష్ణతేజ సర్కిల్, వైకుంఠం 2, ఎస్వీ మ్యూజియం, మఠాలు, వరాహస్వామి విశ్రాంతి గృహాలు, నందకం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, సీఆర్వో కార్యాలయం మీదుగా తిరిగి జీఎన్సీ టోల్‌గేట్‌కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి వచ్చే భక్తులు ఈ ప్రాంతాల్లో ఎక్కడైనా దిగచ్చు. ఈ ప్రాంతాల్లో ఎక్కే ప్రయాణికులు జీఎన్సీ టోల్‌గేట్ వరకు తమకు కావాల్సిన ప్రాంతాల్లో దిగచ్చు. జీఎన్సీ తర్వాత తిరుపతి వెళ్లే భక్తులు మాత్రమే టికెట్ కొనాలి. తిరుపతికి వెళ్లే భక్తులకు వరాహస్వామి విశ్రాంతి గృహాల వద్ద టికెట్లు విక్రయించే కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరానికి అనుగుణంగా ఈ బస్సుల సంఖ్యను 150 వరకు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

కూటమిలో కోవర్టులు!

- కౌన్సిల్ సమావేశంలో బట్టబయలు
- ఆలోచనలో పడ్డ నేతలు

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్డీఏ కూటమిలో కోవర్టుల భయం పట్టుకుంది. నగరపాలక సంస్థకు చెందిన ఓ స్థలాన్ని విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొందరు కార్పొరేటర్ల వ్యవహారశైలి తీవ్ర చర్చకు దారితీసింది. వైసీపీ కండువా తీసి కూటమి కండువాలు కప్పుకున్నారు గానీ గత పార్టీ భావజాలం మాత్రం అలాగే ఉందనే వాదన కౌన్సిల్ సమావేశంలో స్పష్టమైంది. అధికార పార్టీతో ఉంటే అన్ని పనులు చక్కబెట్టుకోవచ్చనే స్వార్థంతోనే కండువాలు వేసుకుని కొందరు, వేసుకోకుండా మరికొందరు తిరుగుతున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు కూటమి మద్దతు కార్పొరేటర్లు ప్రతిపక్ష పార్టీ నిర్ణయానికి అనుకూలంగా కనిపించి కూటమి నేతలకు షాక్ ఇచ్చారు. సాక్షాత్తు కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎదుటే కూటమి నిర్ణయానికి అడ్డుతగలడం ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కూడా కార్పొరేటర్ల వ్యవహారశైలిపై నాయకుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశానికి ముందురోజే తిరుపతిని అమ్మేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను తిట్టిపోస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే డిప్యూటీ మేయర్లు, కూటమిలోని మహిళా కార్పొరేటర్లు మినహా గట్టిగా గొంతెత్తి ఖండించాల్సిన సీనియర్ కార్పొరేటర్లు మాత్రం సెటైర్లు వేసుకోవడం ఎమ్మెల్యేని నివ్వెరపరిచింది. అయినప్పటికీ కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడే సమయంలోనూ వైసీపీని ఖండించని కార్పొరేటర్లనే పక్కన పెట్టుకున్నారు. కూటమిలో విలువ, స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ కొందరు ఇంకా వైసీపీ బంధం నుంచి బయటపడకపోవడంలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే సదరు కార్పొరేటర్లు పనిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కూటమిలో కోవర్టులను పెట్టుకుని రాజకీయాలు ఎలా చేయాలంటూ నాయకులు మదనపడుతున్నారు. ఇకనైనా ఇలాటివారిపట్ల అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారు.

వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి

మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చాణక్య హోటల్ విక్రయానికి అనుకూలంగా ఓటేసిన వైసీపీ కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆపార్టీకి చెందిన మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు గురువారం కమిషనర్ మౌర్యకు వినతి పత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశానికి ముందు తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేసినా కొందరు ధిక్కరించి కూటమికి అనుకూలంగా మాట్లాడారన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఉమా అజయ, ఆరణి సంధ్య, అమరనాథ్ రెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

తోతాపురి తక్కువకు కొంటే కఠిన చర్యలు

ఇద్దరు ర్యాంపు యజమానులపై కేసు నమోదు చేయించిన కలెక్టర్

పాకాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయల రైతులకు తక్కువ ధర చెల్లించే ర్యాంపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్ పరిసరాల్లోని ర్యాంపులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులు కిలో రూ.3 చొప్పున కొంటున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతుల నుంచి ఫిర్యాదు తీసుకొని ర్యాంపు నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని సీఐ సుదర్శన ప్రసాద్‌ను ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా ఓ రైతు నుంచి ఫిర్యాదు తీసుకొని ర్యాంపు వద్ద కొనుగోలు చేస్తున్న షోలాపూర్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ర్యాంపుల వద్ద కనీసం కిలో రూ.4కు తక్కువ కాకుండా కొనుగోలు చేయకుంటే ఆ ర్యాంపులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ర్యాంపు వద్ద వీఆర్వో, కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. జీఎస్‌కేసీఎంఎన్ ర్యాంపు నిర్వాహకుడు ట్రేడర్లతో కలిసి సిండికేట్ అయి టన్ను తోతాపురి కాయలకు 25 కిలోల చొప్పున సూట్ రైతుల నుంచి తీసుకుంటున్నట్లు గుర్తించారు. అదనంగా సూట్ తీసుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మామిడికాయలు తోలిన రైతు భాస్కర్‌రెడ్డితో కలెక్టర్ ఫోనులో మాట్లాడగా, కిలో రూ.3కు జీఎస్‌కేసీఎంఎన్ ర్యాంప్ యజమాని కొన్నారని చెప్పారు. దీంతో ఆ ర్యాంప్ యజమానిపై కలెక్టర్ కేసు నమోదు చేయించారు. తోతాపురి రైతులకు ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబరు 0877 2236007కు ఫోనుచేసి చెప్పాలన్నారు. ఉప్పరపల్లె పంచాయతీ రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ గుజ్జు పరిశ్రమను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా వచ్చిన రైతులకు టోకెన్లు జారీ చేసి కొనాలని సూచించారు. చివరి మామిడికాయ వరకు కొనేలా చర్యలు చేపడతామని, ప్రతి రైతుకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ వారి ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, తహసీల్దారు సంతోష్‌సాయి, ఉద్యానశాఖ అధికారిణి శైలజ తదితరులు పాల్గొన్నారు.



మ్యాంగోనగర్ సమీపంలో ర్యాంపుల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

22న జిల్లాస్థాయి అండర్-15 చదరంగం పోటీలు

తిరుపతి(క్రీడలు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూత్‌హాస్టల్ వేదికగా ఈనెల 22న జిల్లాస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్, ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాససూరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు 01-01-2010లో జన్మించివుండాలి. మరిన్ని వివరాల కోసం 98852 38474, 89773 71753 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్

- పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం
- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ వెల్లడి

- 4లో -



మూడు కిలోల గంజాయి స్వాధీనం

రేణిగుంట, జూన్ 19, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ జీపు స్టాండులో గురువారం గంజాయి విక్రయిస్తుండగా అర్బన్ సీఐ జయచంద్ర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వీరికి అందిన సమాచారంతో జరిపిన దాడుల్లో మూడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకకు చెందిన భరత్, దినేష్, నితీష్, ఒడిసాకు చెందిన జోగేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు పోలీసులు తెలిపారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకున్న మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులోని బాలుర పాఠశాలలు.. పుదూరు, సూళ్ళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరులోని బాలికల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉన్నతాధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. వీరిలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత ఉన్నారు.





కలెక్టర్‌ను కలిసిన వినోద్, రజిత

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,440

తలనీలాలు సమర్పించినవారు: 33,687

ఉగ్రవాదులను ఎదుర్కొంటాం





● తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

అతిథిగృహం ముందు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆక్టోపస్ మాక్‌డ్రిల్ జరిగింది. దేశసరిహద్దుల్లో గతంలో నెలకొన్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో ఆక్టోపస్, పోలీసులు వరుసగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పద్మావతి అతిథి గృహంలోనూ మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్ సాగిందిలా..

పద్మావతి అతిథిగృహంలో ఉగ్రవాదులు ప్రవేశించారని బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆక్టోపస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేశారు. స్పందించిన ఆక్టోపస్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత స్పష్టమైన ప్రణాళికతో మాక్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం ఆక్టోపస్ సిబ్బంది ఆయుధాలతో అతిథిగృహం వద్దకు చేరుకుని ఓ అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు ఉగ్రవాదులను హతమార్చారు. గాయపడిని ఓ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించారు. అనుకున్న విధంగానే ఆపరేషన్‌ను ఐదుగంటల్లో పూర్తిచేసి మాక్ డ్రిల్‌ను ముగించారు. ఈ ఆపరేషన్‌లో ఆక్టోపస్‌తో పాటు స్థానిక పోలీసులు, రిజర్వ్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్, బాంబ్ స్క్వాడ్, ఫైర్ టీం, మెడికల్ విభాగాలు పాల్గొన్నాయి.





అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శాఖల వారీగా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

● టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు టీటీడీలో అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ జరిపి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు భక్తుల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందజేస్తున్న సేవలు, లగేజీ, కల్యాణకట్ట, వైద్యం, పారిశుద్ధ్యం, విజిలెన్స్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం, ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలన్నారు. వసతి గృహాల్లో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రద్దీ సమయాల్లో లడ్డూ కౌంటర్ వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరగాలన్నారు. రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్టల్లోని భక్తుల వసతులపై అధిక శ్రద్ధ వహించాలన్నారు. తిరుమలలో వసతి బస్సుల సదుపాయ సమాచారాన్ని మైకుల ద్వారా ప్రకటనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి(వర్చువల్), జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్

● పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం ● జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ వెల్లడి

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. మీ సమస్యలపై ప్రత్యేక హెల్ప్‌లైన్, మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. వీటిపై తక్షణమే విచారించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ మహిళా అయోగ్ ఆప్కేద్వార్, మహిళా జన్‌సున్వై కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరకట్నం, సైబర్ నేరాలు, లైంగిక నేరాలు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో పెండింగులో ఉన్న మహిళా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల సమస్యలను పరిష్కరించే దిశగా 8 జిల్లాల గ్రీవెన్స్‌కు సంబంధించి ఈ మహిళా జన్‌సున్వై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోఖాయ బేగం మెంబర్, అడ్వకేట్‌లు కంచి శ్యామల, కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను డాక్టర్ అర్చన మంజుదార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆమె ఆదేశించారు.



సమస్యను వింటున్న మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్, అధికారులు

● ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి సమక్షంలో కొందరు ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు. భూ అమ్మకంలో మధ్యవర్తిగా వ్యవహరించినందుకు తిరుచానూరు పోలీసులు హేమలత అనే మహిళపై దాడికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు.

● 'తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీతో మాట్లాడాలని ఇంటికి పిలిపించి ధనశేఖర్ అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి దాడి చేశారు. ప్రధాన నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకుండా పోలీసులు తప్పించారు' అంటూ వినతిపత్రం అందించారు. 15 రోజుల్లోపు వీటిపై విచారించి తమకు నివేదిక పంపాలని పోలీసు అధికారులకు కమిషన్ సభ్యురాలు ఆదేశించారు.

ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనమంజుదార్ గురువారం తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. వైద్యసేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ మంది మహిళలు పని చేసే కార్యాలయాల్లో, సంస్థల్లో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ)ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధా, పార్థసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యావ్యవస్థ అధ్యయనంలో భాగంగా శ్రీలంకకు చెందిన సుమారు 45మంది విద్యావేత్తలు గురువారం మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, ఉపాధ్యాయల పనితీరు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో సమకూర్చిన వసతులపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందని శ్రీలంక ప్రతినిధులు మహేందర్, ఫెరారీ కొనియాడారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులు తమ దేశ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ, శేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేస్ బజ్జూరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు: 1వ తరగతిలో ఎస్టీ 1, సీడబ్ల్యూఎస్ఎన్ 1, 2వ తరగతిలో ఎస్టీ 1, 3వ తరగతిలో ఎస్టీ 1, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో ఎస్సీ 1, ఎస్టీ 1ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

తిరుపతి(సెంట్రల్), జూన్19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్ జోనల్ జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఉత్తరం వైపు జరుగుతున్న పనుల్లో ఆలస్యంపై ఆరా తీశారు. నిర్దేశిత సమయంలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాన్నారు. ఈ తనిఖీల్లో జోనల్, డివిజన్ స్థాయి అధికారులు సీఈ కె.సూర్యనారాయణ, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, మల్లాడి శ్రీనివాస్, జి.వామనమూర్తి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, మణికంఠ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఎస్ఎస్ఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెలాఖరుకు జీఎం అరుణ్ కుమార్ జైన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ఏఐబీఎస్పీ

● జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా, బహుజనులను అధికారంలోకి తెచ్చేందుకు ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) ఏర్పాటైందని ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రెండు ఆధిపత్య కులాలే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. బహుజన కులాల్లో చీలికలు తెచ్చి, వారిని తమ వెంట నడిపించుకుంటూ అధికారాన్ని అనుభవిస్తున్నాయి. అందుకని బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లను ఏకతాటిమీదకు తీసుకొచ్చి వారికి రాజ్యాధికారమే లక్ష్యంగా ఏఐబీఎస్పీ కృషి చేస్తుంది' అని వివరించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు కులాల పార్టీలకు రాజకీయసమాధి కట్టి, బహుజన కులాలను అధికారంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి, ఒంగోలు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, విద్యార్థి సంఘం నాయకులు వెంకటస్వామి, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, ప్రముఖ న్యాయవాది మునయ్య తదితరులు పాల్గొన్నారు.



సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

84 వేల మందికి సికిల్ సెల్ అనీమియా పరీక్షలు

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'సికిల్ సెల్ అనీమియా.. వారసత్వంగా వచ్చే వ్యాధి. దీని నివారణకు జిల్లాలో విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 84 వేల మందికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్ వచ్చింది' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినం సందర్భంగా గురువారం తిరుపతిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను పూర్తిగా తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 1,24,000 మందికి సికిల్ సెల్ అనీమియాకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉండగా.. వీరిలో 84 వేల మందికి పరీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఓ 15 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ప్రభు అనే యువకుడు గత నెల 30వ తేదీన బయటకు తీసుకెళ్లాడు. వెంకటగిరిలోని అతడి బంధువుల ఇంట్లో ఉంచాడు. దీనిపై బాలిక తల్లి తండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో ఆ బాలికను ప్రభు తీసుకెళ్ళినట్లు తెలిసింది. వెంకటగిరికి వెళ్ళి బాలికను తీసుకొచ్చి గురువారం తల్లితండ్రులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. త్వరలో అతడిని అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.



ఆలయంలో గణపతి సచ్చిదానంద

తాపత్రయం వద్దు.. క్రమశిక్షణతో స్వామిని దర్శించండి

● గణపతి సచ్చిదానంద సూచన

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తాపత్రయ పడకుండా, క్రమశిక్షణతో దర్శించుకోవాలని దత్తపీఠం గణపతి సచ్చిదానంద సూచించారు. తొక్కిసలాటలకు దూరంగా ఉండాలన్నారు. తిరుమల ఆలయ మహద్వారం వద్దకు గురువారం ఉదయం చేరుకున్న సచ్చిదానందకు టీటీడీ అర్చక బృందం, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. అనంతరం మూలమూర్తిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సాలిగ్రామంగా ఉన్న తిరుమల కొండపై చెప్పులు కూడా వేసుకోకూడదన్నారు. ఒకప్పుడు స్వామి అందరితో మాట్లాడేవారని, క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన క్రమంలో ఆయన రాయిగా మారి నిలుచుండి పోయారని పేర్కొన్నారు. స్వామి వద్దకు వచ్చి కష్టం చెప్పుకుంటే ఇట్టే తొలగిపోతాయన్నారు. పైసా హుండీలో వేస్తే పది పైసలు స్వామి ప్రసాదిస్తారన్నారు. టీటీడీ యాజమాన్యం కూడా కానుకలను సమర్థంగా వినియోగిస్తోందని అభినందించారు. ప్రస్తుతం యుద్ధ భయం నెలకొని ఉందని, పరమాత్ముడు ఇచ్చిన భూమిపై ఎందుకు కొట్టుకోవాలని ఆయన ప్రశ్నించారు. శాంతిగా ఉండే బుద్ధిని అందరికీ ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. తాను ఓ ఆలయాన్ని కడుతున్న క్రమంలో స్వామికి చెప్పి ఆశీస్సులు పొందేందుకు వచ్చానన్నారు. భవిష్యత్తులో అమెరికాలోనూ ఆలయాన్ని నిర్మించబోతున్నట్టు వెల్లడించారు.

టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న శివకోటరెడ్డి

చిల్లకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని సంస్థాగత ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు శివకోటరెడ్డి అన్నారు. గురువారం స్థానిక జ్యోతి వే బ్రిడ్జి కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని పటిష్టపరిచేందుకు మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయంతో తీసుకుని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అధ్యక్ష పదవికి దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి నెల్ల టూరు చిరంజీవి, గుండాల శ్రీనివాసులు పేర్లు నమోదు కావడంతో అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు పొన్నలూరు రామకృష్ణయ్య, శీలం కిరణ్‌కుమార్, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, గుండాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుపరిపాలనే బీజేపీ లక్ష్యం


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయం వద్ద నరేంద్ర మోదీ ప్రధానిగా 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మోదీ ఎంతో కృషిచేశారన్నారు. సంక్షేమ పథకాలను అమలు పరచడమే కాకుండా, ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని శక్తివంతంగా ఎదిగేందుకు ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీని బలోపేతం చేసేందుకు అందరం కలికట్టుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, శ్రీనివాసులు, బిందురెడ్డి, సునీల్‌కుమార్, ప్రభాకర్, హరికృష్ణ, రవీంద్ర, బాలకృష్ణ, శివ, నాగమణి, నిరంజన్, వాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా మధుసూదనరెడ్డి


మధుసూదనరెడ్డి, కృష్ణమూర్తిలను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వాకాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండల టీడీపీ అధ్యక్షుడిగా దువ్వూరు మధుసూదనరెడ్డి పదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గూడూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటరెడ్డి, మండల పరిశీలకుడు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, విజయబాబు ఆధ్వర్యంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు గురువారం జరిగాయి. టీడీపీ అధ్యక్షుడిగా దువ్వూరు మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దోశకాయల కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిద్దరినీ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, హరీష్‌నాయుడు, దువ్వూరు జనార్దనరెడ్డి, కుంచం దయాకర్, నెల్లూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వస్తున్న విద్యార్థినులు

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. గురువారం కళాశాలలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ సహకారంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా ద్వారా మానసిక ఉల్లాసం పెరగడంతో పాటు ఏకాగ్రత పెంచుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటుగా మార్చుకుని ప్రశాంతవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు ప్రవీణలత, సురేష్, గాయత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గాయత్రి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శివకుమార్‌రెడ్డి, వెంకురెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చాలి

సూళ్లూరుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చాలని ఏఐవైఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి అన్నారు. గురువారం పట్టణంలోని షార్ బై జంక్షన్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల యువత నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మల్లికార్జున్, నాగార్జున, రమణయ్య, సుధాకర్‌రెడ్డి, చెంచమ్మ పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్‌లకు రేషనలైజేషన్ వద్దు

నాయుడుపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్‌లకు రేషనలైజేషన్ విధానం వర్తింపచేయరాదని డిమాండ్ చేస్తూ గురువారం ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్‌లకు సొంత మండలంలో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే జేఎల్‌ఎం గ్రేడ్2, అసిస్టెంట్ లైన్‌మెన్‌గా ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, పెంచల ప్రసాద్, నాధమునిరెడ్డి, ప్రసన్నకుమార్, సుధీర్, రామయ్య, రమణ, నసీబ్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

పాఠశాల విలీనం వద్దు


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చిల్లకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు ప్రాథమికోన్నత పాఠశాలను అల్లీపురం ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడాన్ని ఖండిస్తూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 5వ తరగతి చదివే 49 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. వీరందరినీ సుమారు 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న అల్లీపురం ప్రాథమిక పాఠశాలకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ఆ మార్గంలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, తమ పిల్లలను అంతదూరం పంపలేమన్నారు. ఏరూరు ప్రాథమికోన్నత పాఠశాలను అక్కడే కొనసాగించాలని కోరారు.

విలీనాన్ని నిరసిస్తూ తరగతుల బహిష్కరణ

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం నెర్నూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం తరగతులను బహిష్కరించారు. పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 90మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులోని 6,7 తరగతులను సమీప గ్రామమైన తిరువెంగలాయపల్లి పాఠశాలలో విలీనం చేశారు. దీంతో 6,7 తరగతుల్లో 40 మంది వరకు విద్యార్థులు మూడు కిలో మీటర్ల దూరంలోని తిరువెంగలాయపల్లి పాఠశాలకు వెళ్లాల్సి వుంటుంది. ఈ నిర్ణయాన్ని పిల్లల తల్లిదండ్రులు ఖండించారు. గురువారం విద్యార్థులను పాఠశాలకు పంపకుండా నిరసన తెలిపారు. శుక్రవారం పాఠశాల వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. అధికారులు పరిశీలించి నెర్నూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలోనే తరగతులను కొనసాగించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు.



విద్యార్థులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల


ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన

పెళ్లకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబడిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పెళ్లకూరు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. చెంబడిపాలెంతో పాటు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను దిగువచావాలి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. సుమారు 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆ పాఠశాలకు ఎక్స్‌ప్రెస్ హైవేపై నుంచి విద్యార్థులు వెళ్లాల్సి ఉంటుందని, దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు పునరాలోచించి చెంబడిపాలెం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో తరగతులను కొనసాగించాలని కోరారు.


యోగా చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మహిళలు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

తడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి దూరమై ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం ఉదయం మండల పరిధిలోని భీములవారిపాళెం పడవల రేవు వద్ద పర్యాటకశాఖ రిసార్ట్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన కార్యక్రమాల్లో యోగా సాధన అలవాటు చేసుకోవాలన్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ యోగా సాధనతో శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వన్య ప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక, డీఈవో కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి, జడ్పీటీసీ ఇందుమతి, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్‌నాయక్, విద్యుత్ ఏడీఈ శేఖర్, టీడీపీ నాయకులు సెల్వం, బొమ్మన శ్రీధర్, సుధాకర్, టీకే శ్రీనివాసన్, రత్నం, రవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నై బీచ్ వరకే చార్మినార్ ఎక్స్‌ప్రెస్

నాయుడుపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నుంచి చెన్నై తాంబరం వరకు వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ జూన్ 20 నుంచి జూలై 18వ తేదీ వరకు చెన్నై బీచ్ స్టేషన్ వరకే వెళ్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

బాలాయపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు గ్రామానికి చెందిన గుర్రం రాఘవులు, దొడ్డగా మున్నెమ్మ తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరును బుధవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా వినీల్‌కుమార్

బాలాయపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవోగా పనిచేస్తున్న వినీల్ కుమార్‌కు ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు గురువారం జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు దీర్ఘకాలపు సెలవు పెట్టారు.

పచ్చని చెట్లపై గొడ్డలివేటు


వెంకన్నపాళెం సమీపంలో
ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన చెట్లను నరికివేస్తున్న దృశ్యం

కోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం, రంగన్నగుంట మార్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లపై గురువారం గొడ్డలివేటు పడింది. ఈ మార్గంలో ఎన్నో ఏళ్ల క్రితం నాటిన మొక్కలు పెద్దవై పాదచారులు, వాహనచోదకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నాయి. ఇటీవల కొందరు పచ్చని చెట్లను నరికి కొయ్యల మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కత్తిపోట్ల కేసులో నిందితుడి అరెస్టు

కోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లిలో శ్రీహరి అనే యువకుడిని కత్తితో పొడిచి పరారైన సూర్యను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఇంటివద్ద ఉన్న శ్రీహరిని సూర్య పాత కక్షల నేపథ్యంలో బుధవారం స్కూటీపైవచ్చి కత్తితో పొడిచి పరారయ్యాడు.

అధ్యాపకురాలికి సన్మానం


శైలజను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్, అధ్యాపకులు

గూడూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగ అధ్యాపకురాలు శైలజను గురువారం సన్మానించారు. జిల్లాలో చేతివృత్తులపై ఆర్థిక అంశాలు - ప్రభావం అనే అంశంపై శైలజ పరిశోధన చేసినందుకు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చింది. ఆమెను ప్రిన్సిపాల్ శివప్రసాద్, అధ్యాపకులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, నారాయణరాజు, డాక్టర్ పీర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి

వెంకటగిరి టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు ఇంటిని మరిపించేలా నాణ్యమైన భోజనం పెట్టాలని సీడీపీవో షంషాద్‌బేగం అన్నారు. గురువారం స్థానిక బొగ్గులమిట్ట, ధర్మాపురం, తోలిమిట్ట, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ కంపెనీ వేధింపులతో ఆత్మహత్యాయత్నం

సూళ్లూరుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిట్ ఫండ్ కంపెనీ వేధింపులు తాళలేక టిఫిన్ సెంటర్ యజమాని ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీహరికోట రోడ్డులో వైసీపీ కార్యాలయం వద్దనున్న ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు శ్రీనివాసులు ప్రైవేట్ చిట్స్ ఫండ్ కంపెనీలో రుణం తీసుకున్నాడు. మూడు నెలల నుంచి ఈఎంఐ చెల్లించకపోవడంతో బుధ వారం ఫైనాన్స్ చిట్ ఫండ్ ఉద్యోగులు టిఫిన్ కొట్టు వద్దకెళ్లి తీసుకున్న రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. కొంత సమయం కావాలని కోరినా అంగీకరించకపోవడంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసులు గురువారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

తడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడు గ్రామానికి చెందిన గూటం మునెమ్మ(62) పాముకాటుతో మృతి చెందింది. మంగళవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సన్మానం


కిషోర్ నాయుడిని సన్మానిస్తున్న జనార్దనరెడ్డి

చిట్టమూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన గణపర్తి కిషోర్ నాయుడును గురువారం తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధికార ప్రతినిధి మారంరెడ్డి జనార్దనరెడ్డి సన్మానించారు. అలాగే గూడూరు నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కస్తూరయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీద్, బీసీ సెల్ అధ్యక్షుడు దొడ్డగ వెంకటరమణ, తెలుగు రైతు అధ్యక్షుడు దువ్వూరు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఈదూరు ధనంజయ్య నాయుడు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచితగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వెంకటగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేపల్లి సీహెచ్‌సీ పరిధిలో తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి లావణ్య తెలిపారు. అదేవిధంగా ఈనెల 20న చెలికంపాడు, ఉప్పరపల్లి, 23న వల్లివేడు, యతలూరు గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

'తల్లికి వందనం' గడువు పొడిగించాలి

నాయుడుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీని పొడిగించాలని అవాజ్ కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనేక మంది నిరుపేదలు అర్హులైన ఉండి కూడా తల్లికి వందనం పథకాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. వారం దరూ దరఖాస్తు చేసుకోవడానికి అనువుగా గడువు పొడిగించాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు పి.హలీమ్‌ఖాన్, ఖాదర్, అబ్దుల్లా, ఉస్మాన్, గనీ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ పథకంపై అవగాహన

గూడూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై శుక్రవారం స్థానిక రెండోపట్టణ పరిధిలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో గురువారం విద్యుత్‌శాఖ ఈఈ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అందించే సబ్సిడీ తదితర అంశాలను వినియోగదారులకు వివరించారు.

విద్యా సామగ్రి పంపిణీ

వెంకటగిరి టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుర్జాగుంట ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు వెంకటగిరి మండల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పెన వెంకటేశ్వర్లు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు గీత, రెహానా పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు రోసనూరు విద్యార్థి


ముత్యాలయ్యతో ఉపాధ్యాయులు

పెళ్లకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని రోసనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కాగితాల ముత్యాలయ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 20నుంచి 23వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో ముత్యాలయ్య పాల్గొంటాడని తెలిపారు. ముత్యాలయ్యను ఉపాధ్యాయులు భువనశంకరాజు, రవి, వెంకట్రాయులు, కృపాల్, ప్రసాద్, యస్‌ధానిబాషా, వీరరాఘువులు, పీఈటీ చంద్రయ్య, రెజ్లింగ్ కోచ్ ఉదయ్ కుమార్ అభినందించారు.

యోగా దినోత్సవాన్ని లక్ష్యంగా తీసుకోండి

కోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక లక్ష్యంగా తీసుకోవాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్, తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య కోరారు. ఈనెల 21వ తేదీ జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంపై గురువారం తహసీల్దారు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగా దినోత్సవం నిర్వహణ కోసం మండలంలోని 140 కేంద్రాలకు సచివాలయ సిబ్బందిని ఇన్‌చార్జిగా నియమిస్తామన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, ఏపీఎం అనీల, సీడీపీవో మునికుమారి, ప్రభుత్వ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

కోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిపెట్టాలని ఉద్యానవన అధికారి సునీత కోరారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఆయిల్‌పామ్ తోటలను గురువారం ఆమె పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే 25 నుంచి 30 సంవత్సరాల పాటు నిరంతరాయంగా దిగుబడి ఇస్తుందన్నారు. 36 నెలల తరవాత మొదటి కోత ప్రారంభమవుతుందని, మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన భూములు ఉన్నాయని, రైతులు దృష్టి కేంద్రీకరించాలని సునీత కోరారు.

నెలాఖరులోగా భూముల ఖాతా నెంబర్ల విభజన

ఓజిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూముల జాయింట్ ఖాతా నెంబర్ల విభజన ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు సూళ్లూరుపేట డివిజన్ డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ హరిహర తెలిపారు. గురువారం ఓజిలిలోని తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటి వరకు జరిగిన ఖాతా నెంబర్ల విభజన వివరాలను ఆయన పరిశీలించారు. మండలంలో జాయింట్ ఖాతా నెంబర్ల కారణంగా 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విభజన వివరాలు కష్టమవుతోందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి చూకూరడంలేదని, జాయింట్ ఖాతా నెంబర్ల కారణంగా పలువురికి 'తల్లికి వందనం' పథకానికి అనర్హులయ్యారని తెలిపారు. జాయింట్ ఖాతా నెంబర్లను సవరించి వ్యక్తిగతంగా నమోదు చేసే ప్రక్రియను మండల సర్వేయరు లక్ష్మీనారాయణతో పాటు గ్రామ సర్వేయర్ల బృందం వేగవంతం చేసిందన్నారు.

పని గంటల పెంపు విరమించుకోవాలి


డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

సూళ్లూరుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల పనిగంటల పెంపును ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఎం.శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల హక్కులను కాలరాస్తూ పనిగంటలను పెంచడం అన్యామన్నారు. మహిళలకు రాత్రి వేళల్లో విధులు వేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పని గంటల పెంపును నిరసిస్తూ ఈ నెల 19న అన్ని డిపోల వద్ద చేపట్టే ఆందోళన కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలకృష్ణయ్య, సాల్మన్, సుబ్రహ్మణ్యం, శ్యామూల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీసుకెళ్లే పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ సర్కిల్ వద్ద ఎంవీఐ ఆధ్వర్యంలో రవాణాశాఖ సిబ్బంది పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. ఈనెల 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గురువారం బస్సులను తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, భద్రత చర్యలను పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం నుంచి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, రమేష్, మణి, పెంచలప్రసాద్, ప్రసాద్, వెంకటరమణ, మురళి, రాజేష్, శంకరయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.